ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కాకినాడ

జిల్లా వార్తలు

మంగళవారం 21 జనవరి 2025 | 5



తృటిలో తప్పిన ప్రమాదం 7

» పంట పొలాల్లోకి దూసుకుపోయిన ఒల్వా బస్

ఏడీబీ రోడ్డులో 7

భారీ అగ్ని ప్రమాదం



డీజీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ విక్రాంత్

మార్చి 31 లోపు..

లక్ష సీసీ కెమెరాల ఏర్పాటే లక్ష్యం

మెయిన్, 7వ పేజీల్లో

- సైబర్ నేరాల మినహా నేరాలు తగ్గుముఖం
- ఆర్టీసీ ఎండీ, డీజీపీ ద్వారకా తిరుమలరావు
- కాకినాడలో పర్యటన.. ఆర్టీసీ డిపో సందర్శన

కాకినాడ క్రైం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): నేరాలను మరింత అరికట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా మార్చి 31 లోపు లక్ష సీసీ కెమెరాల ఏర్పాటు లక్ష్యమని డీజీపీ ద్వారకా తిరుమలరావు అన్నారు. ఇప్పటికే క్రైం హాట్‌స్పాట్స్‌లో 18వేల సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని కాకినాడ, రాజమహేంద్రవరం నగరాల్లో సోమవారం ఆయన పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కాకినాడ, రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపోలను ఆర్టీసీ ఎండీ హోదాలో పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. కాకినాడ పర్యటనలో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో డీజీపీ మాట్లాడారు. కార్యక్రమంలో ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్, కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్, అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, ట్రైనీ ఏఎస్పీ సుస్మిత, ఏఎస్పీ భాస్కర్‌రావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో డీజీపీకి సెల్యూట్ చేసి ఆహ్వానం పలుకుతున్న పోలీసులు

కలిసొచ్చిన సంక్రాంతి



- ప్రత్యేక సర్వీసుల ద్వారా ఆర్టీసీకి భారీగా ఆదాయం
- 130పైనే బస్సులు ఏర్పాటు
- ఇప్పటికే రూ.43 లక్షలపైనే ఆదాయం

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 20(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకు ఆర్టీసీకి అదనపు ఆదాయం సమకూరింది. అధికారులు ముందుగా భావించినట్లుగానే ఆర్టీసీకి ప్రయాణికుల రద్దీ కనిపించింది. పండుగకు కాకినాడ జిల్లాకు వచ్చి, వెళ్లే వారి కోసం ప్రత్యేకంగా 130పైనే బస్సులను ఏర్పాటు చేశారంటే ప్రయాణికుల రద్దీ ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. ఇక కనుమకు తిరుగు ప్రయాణికులు పెద్దగా ఉండరని అధికారులు భావించినా అందుకు భిన్నంగా ప్రయాణికుల జోరు కనిపించింది. దీంతో కనుమ, తర్వాత రెండు రోజులు ప్రయాణికుల రద్దీతో స్పెషల్ బస్సులు సమకూర్చారు. పండగకు జిల్లాకు వచ్చే ప్రయాణికుల కోసం హైదరాబాద్ నుంచి కాకినాడ జిల్లాకు 64 బస్సులు ఏర్పాటు చేశారు. పండుగ అనంతరం తిరుగు ప్రయాణికుల కోసం 66 బస్సులు ఏర్పాటు చేశారు. దీంతో ఆర్టీసీకి రూ.43లక్షలకుపైనే ఆదాయం వచ్చినట్లు అధికారులు చెప్తున్నారు. ఇక పండుగ ముగిసిన తర్వాత తిరుగు ప్రయాణికుల కోసం అదనపు సర్వీసులు ఏర్పాటు చేశారు. కనుమ రోజు రాత్రి, తర్వాత రోజు రెండు రోజులు అదనంగా బస్సులు ఏర్పాటు చేశారు. కాగా విద్యాసంస్థలు సోమవారంనుంచి పునః ప్రారంభమవుతున్న నేపథ్యంలో శని, ఆది, సోమవారాలు జిల్లా నుంచి తిరుగు ప్రయాణమయ్యే వారి రద్దీ ఎక్కువగా ఉండచ్చని అధికారులు భావిస్తున్నారు. ఇందుకోసం అదనంగా బస్సులు ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యారు.

ముందుగానే ప్రణాళిక సిద్ధం

-జిల్లా ప్రజారవాణాధికారి శ్రీనివాసరావు

పండుగకు వచ్చిన ప్రయాణికులు జిల్లా నుంచి తిరుగు పయనమయ్యేందుకు శని, ఆది, సోమవారం వెళ్లనున్నారనే ఉద్దేశంతో అదనంగా స్పెషల్ బస్సు సర్వీసులు ఏర్పాటు చేశాం. ఎప్పటికప్పుడు ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా సర్వీసులను ఏర్పాటు చేస్తున్నాం. ఇందుకోసం ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి మానిటరింగ్ చేస్తున్నాం. హైదరాబాద్‌నుంచి కాకినాడ జిల్లాకు 66 బస్సులు తిప్పుతున్నాం. కాకినాడ డిపో నుంచి హైదరాబాద్ 9 బస్సులు, విశాఖపట్నం 6, పలాస 1, పార్వతీపురం 1, బత్తిలి 2, విజయనగరం 1, రాజమహేంద్రవరం 2, అమలాపురం 2, వాడపల్లి 2 మొత్తం 26 స్పెషల్ బస్సులు ఏర్పాటు చేశాం.

పాటిల్‌పై వేటు



- జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌పై బదిలీ వేటు
- బాధ్యతలు స్వీకరించి ఆరునెలలు తిరగకుండానే సాగనంపిన ప్రభుత్వం
- అసమర్థ అధికారిగా ముద్ర: డిప్యూటీ సీఎం పవన్ పలుసార్లు ఆగ్రహం
- పిఠాపురంలో దొంగతనాలు, ఆకతాయిల ఆగడాలు పెరగడంపై ఎస్పీ సమక్షంలో పవన్ ధ్వజం
- విక్రాంత్‌పాటిల్ స్థానంలో కొత్త ఎస్పీగా బింధుమాధవ్

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్‌పై వేటు పడింది. ఆయన్ను కర్నూలు జిల్లా ఎస్పీగా బదిలీచేస్తూ ప్రభుత్వం సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో కర్నూలు ఎస్పీగా పనిచేస్తున్న బిందుమాధవ్‌ను నియమించింది. జిల్లా ఎస్పీగా విక్రాంత్‌పాటిల్ బాధ్యతలు స్వీకరించి ఆరునెలలు గడవకముందే ప్రభుత్వం ఈయన్ను సాగనంపేసింది. అసమర్థ అధికారిగా ఆయన ముద్రపడడంతో బదిలీ తప్పదనే ప్రచారం కొంతకాలంగా జరుగుతోంది. ఎట్టకేలకు ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది.

వాస్తవానికి డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఈయన్ను ఏరికోరి జిల్లా ఎస్పీగా వచ్చేలా చేశారు. తీరా పనితీరులో అడుగడుగునా వైఫల్యం చెందారు. చివరకు జిల్లా మంత్రి అయిన డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పలుసార్లు నేరుగా ఎస్పీ వ్యవహారంపై బహిరంగంగానే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతేడాది నవంబరు 29న పవన్ కాకినాడ పోర్టులో తనిఖీలకు వచ్చారు. ఆ సమయంలో ఎస్పీ లేకపోవడంతో ఏరని పవన్ ప్రశ్నించారు. తాను జిల్లాకు వచ్చిన ప్రతిసారీ ఎస్పీ ఉండడం లేదని మండిపడ్డారు. ఆయనకు నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. కాకినాడ కేంద్రంగా రేషన్‌బియ్యంవ్యాపారం భారీగా జరుగుతోందని, పోర్టు ద్వారా విదేశాలకు తరలిపోతున్నా పోలీసుశాఖ సరైన చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనెల 10న పవన్ పిఠాపురంలో నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగిస్తూ పోలీసుశాఖ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పిఠాపురం నియోజక వర్గంలో చోరీలు పెరిగిపోయాయని, ఆకతాయిలు అడ్డూఅదుపు లేకుండా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. పక్కనే ఉన్న ఎస్పీ పవన్ వ్యాఖ్యలతో షాక్ తిన్నారు. పోలీసు అధికారులు పనితీరు మార్చుకోవాలని హెచ్చరించిన పవన్ పరిస్థితి చేజారే వరకు తీసుకువస్తే తాను రోడ్డుమీదకు రావాల్సి ఉంటుందని హెచ్చరించారు. పవన్ ఆదేశాల తర్వాత కూడా ఎస్పీ పెద్దగా సీరియస్‌గా వ్యవహరించకపోవడం విశేషం.

శాంతిభద్రతల పర్యవేక్షణలో విఫలం

విక్రాంత్‌పాటిల్ జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించినప్పటినుంచి పెద్దగా సమర్థవంతంగా పనిచేసిన దాఖలాలు కనిపించలేదు. క్షేత్రస్థాయిలో పర్యటించడం చాలా తక్కువ ఒకెత్తయితే, శాంతిభద్రతల పర్యవేక్షణలో విఫలమయ్యారన్న అపవాదు ఈయన్ను ఎక్కువగా చుట్టుముట్టింది. కాజులూరు మండలం శలపాకలో ముగ్గురి దారుణ హత్య, తర్వాత సామర్లకోట మండలం వేట్లపాలెంలో ముగ్గురి హత్య చోటుచేసుకుంది. ఇలా వరుస హత్యలు జరగడం, దొంగతనాల కేసులు తగ్గకపోవడం ఈవిషయంలో ఎస్పీ పనితీరు చురుగ్గా లేకపోవడం అసమర్థ అధికారిగా ముద్రపడిపోయింది. ఈ నేపథ్యంలో ఈయనపై బదిలీ వేటుకు కారణమైంది. ఈయన్ను కర్నూలు ఎస్పీగా సోమవారం రాత్రి బదిలీ చేశారు.

ఏపీఎస్పీ కమాండెంట్ కర్నూల్‌కు బదిలీ

సర్పవరం జంక్షన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్ ఎం.దీపిక పాటిల్ కర్నూల్ 2వ బెటాలియన్ కమాండెంట్‌గా బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆమె భర్త కాకినాడ ఎస్పీ విక్రాంత్‌పాటిల్ కర్నూల్‌కు బదిలీ అవ్వడంతో స్పౌజ్‌లో ఈమెను కర్నూలుకు బదిలీ చేస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు.

కొత్త ఎస్పీగా బిందుమాధవ్..



కర్నూలు జిల్లా ప్రస్తుత ఎస్పీగా ఉన్న గరికపాటి బిందుమాధవ్‌ను ప్రభుత్వం జిల్లా ఎస్పీగా బదిలీ చేసింది. 2017 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన బిందుమాధవ్ విజయవాడ ప్రాంతానికి చెందిన వ్యక్తి. గతంలో ఈయన ఆదాయపు పన్ను శాఖలో పనిచేశారు. బీటెక్ మధ్య లోనే ఆపేసిన మాధవ్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ పూర్తి చేసి గురువుల ప్రోత్సాహంతో యూపీఎస్సీ పరీక్షలు రాసి ఆ తర్వాత ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. గతంలో ప్రకాశం జిల్లాలో గ్రేహౌండ్స్ విభాగంలో పనిచేశారు. ఆ తర్వాత రంపచోడవరం అదనపు ఎస్పీగాను, గుంటూరు సెబ్ జాయింట్ డైరెక్టర్‌గాను, పల్నాడు జిల్లా ఎస్పీగా పనిచేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పల్నాడు ఎస్పీగా ఆయన్ను ఈసీ నియమించింది. అక్కడ 40రోజులు పనిచేసిన సమయంలో ఆ జిల్లాలో జరిగిన హింసాత్మక సంఘటనల నేపథ్యంలో సస్పెన్షన్‌కు గురయ్యారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈయనపై సస్పెన్షన్‌ను ఎత్తివేసి కర్నూలు ఎస్పీగా నియమించింది.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తా: ఎస్పీ

కాకినాడ జిల్లా ఎస్పీగా రావడం సంతోషం.. త్వరలోనే మంచిరోజు చూసుకుని విధుల్లో చేరుతా. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాపై నాకు అవగాహన ఉంది. గతంలో రంపచోడవరం ఏఎస్పీగా పనిచేసిన అనుభవంతో జిల్లాను శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తా. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నియోజకవర్గం ఉన్న జిల్లా కావడంతో మరింత బాధ్యతగా ఉండాలి. జిల్లా పరిషత్‌ల గురించి అవగాహన ఉండడంతో అందరినీ కలుపుకొని ముందుకు సాగుతా. ప్రశాంతతకు నిలయమైన గోదావరి ప్రాంతంలో శాంతిభద్రతలకు ఆ పేరు కొనసాగేలా కృషి చేస్తాను.

అర్జీలను తక్షణమే పరిష్కరించాలి

» జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రతివారం ప్రజలనుంచి అందుతున్న వినతులను అధిక ప్రాధాన్యమిచ్చి సానుకూల దృక్పథంతో పరిష్కరించాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం సోమవారం కాకినాడ కలెక్టరేట్ హాలులో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన వినతులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అర్జీల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. రెవెన్యూ, పింఛన్లు, బియ్యంకార్డు మంజూరు, ఇళ్లస్థలాలు తదితర అంశాలపై 370 అర్జీలు అందాయన్నారు. జేసీ రాహుల్ మీనా, డీఆర్వో వెంకట్రావు, హౌసింగ్ పీడీ సత్యనారాయణ, జడ్పీ సీఈవో లక్ష్మణరావు పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 60 అర్జీలు



అర్జీదారుల గోడు వింటున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కాకినాడక్రైం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్‌లకు వచ్చే బాధితుల సమస్యలు పరిష్కరించాలని ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా 60మంది అర్జీదారులు సోమవారం పోలీస్ గ్రీవెన్స్‌ను ఆశ్రయించారు. ఫిర్యాదుదారుల గోడు విన్న ఎస్పీ స్పందించి సంబంధిత పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఫిర్యాదులు సమ్మతమైనవైతే ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడ్మిన్ ఎస్పీ ఎంజేవీ భాస్కర్‌రావ్, ట్రైనీ ఏఎస్పీ సుస్మిత, ఎస్బీ డీఎస్పీ శ్రీరామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

సాగు నీరందేనా?

- ఎత్తిపోతల పథకాల ఆయకట్టుకు సాగునీరు సరఫరా జరిగేనా
- రూ.18.80కోట్ల పైబడి పేరుకుపోయిన విద్యుత్ బకాయిలు
- అనధికార నీటి వినియోగంతో రైతుల మధ్య సాగునీటి యుద్ధాలు



సామర్లకోటలో ఎత్తిపోతల పథకంతో నీటి సరఫరా

సామర్లకోట, జనవరి 20: దాళ్వా వరి సాగులో భాగంగా గోదావరి కాలువ పరీవాహక ప్రాంతాలైన సామర్లకోట మండలంలోని పెదబ్రహ్మదేవం, ఇళ్లపల్లి, జి.మేడపాడు, వేట్లపాలెం, పెద్దాడ, కాపవరం ఎత్తిపోతల పథకాల ఆయకట్టు కింద దాళ్వా సాగుకు సమృద్ధిగా సాగునీరు అందుతుందా, లేదా అనే సందిగ్ధ పరిస్థితి రైతుల్లో నెలకొంది.

సాధారణంగా ప్రభుత్వ సాగునీటి పారుదల శాఖ ఆదేశాల మేరకు ఎత్తిపోతల పథకాల కింద 5,100 ఎకరాలకు ఖరీఫ్ సాగుకు మాత్రమే సాగుకు అనుమతులు ఉంటాయి. సామర్లకోట మండల పరిధిలో ఈ ఎత్తిపోతల పథకాల కింద 6వేలఎకరాలు ప్రత్యక్షంగాను, మరో 2వేల ఎకరాలు పరోక్షంగాను రైతుల ప్రతిఏటా సాగు చేస్తుంటారు. కొన్ని ఎత్తిపోతల పథకాల ద్వారా సాగుచేసుకుంటున్న ఆయకట్టుదారుల నుంచి అనధికార వసూళ్లు సైతం సంఘాల ప్రతినిధులు ప్రతిఏటా వసూళ్లు చేస్తుంటారు. దాళ్వాసాగుకు ఎట్టి పరిస్థితుల్లోను అనుమతులు ఉండవు. గోదావరి ఎగువ ప్రాంతాల్లో సాగునీరు పుష్కలంగా ఉంటే రైతుల వినతుల మేరకు రెండో పంటకు అనుమతులు మంజూరు చేస్తుంటారు. ఇందుకు అనుగుణంగా విద్యుత్‌శాఖ నుంచి సైతం ఆదేశాల మేరకు ఎత్తిపోతల పథకాలకు సంబంధించి విద్యుత్ సరఫరాను చేస్తుంటారు. అనుమతుల అనంతరం విద్యుత్ సరఫరా చేసే సమయాలను ప్రకటిస్తుంటారు.

విద్యుత్ బకాయిల మాటేంటో..

ఎత్తిపోతల పథకాల నుంచి విద్యుత్ శాఖకు చెల్లించాల్సిన విద్యుత్ బిల్లుల బకాయిలకు ప్రభుత్వం ప్రత్యేక గ్రాంట్‌ను విడుదల చేసేవారు. ఇప్పటికే ఎత్తిపోతల పథకాలకు సంబంధించి విద్యుత్ బకాయిలు రూ.18.80కోట్లు పైబడి పేరుకుపోవడంతో బకాయిలు చెల్లించాల్సిందేనని విద్యుత్ అధికారులు ఇప్పటికే పలుదఫాలు నోటీసులు జారీ చేశారు. ప్రభుత్వం విద్యుత్ బకాయిలు నేరుగా జమ చేసేది. నాలుగున్నరేళ్లుగా వైసీపీ ప్రభుత్వం ఎత్తిపోతల పథకాల విద్యుత్ బిల్లులు చెల్లించాల్సిన దాఖలాలే లేకపోయాయి. ఇప్పటివరకూ ఈ ఆయకట్టు రైతులకు ఎటువంటి సమాచారం లేకపోవడంతో దాళ్వా సాగుచేయాలా, వద్దా అనే సందిగ్ధ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. దాళ్వా సాగుకు పూర్తిస్థాయిలో సాగునీరందించేలా గోదావరి ఎగువ ప్రాంతాల్లో నీటి నిల్వలు ఎంతమే ఉన్నాయో గురువారం సాయంత్రం వరకూ ఇరిగేషన్ అధికారులు ప్రకటించలేదు. వ్యవసాయశాఖ అధికారులు రైతులను దాళ్వా సాగుకు సమాయత్తం కావాలని ప్రాథమికంగా హెచ్చరించారు. కాగా గోదావరి కాలువ జలాల ఆదారంగా విడుదల చేస్తున్న గోదావరి జలాలను అనుమతులు లేకుండా సామర్లకోట ఎగువ ప్రాంతాల్లో ఎత్తిపోతల పథకాలు అనధికారికంగా వినియోగించడంవల్ల దిగువ ప్రాంతాలైన పీబీసీ కెనాల్‌కు నీటి సరఫరా గణనీయంగా తగ్గి పీబీసీ ఆయకట్టు రైతులు నీటిఎద్దడి సమస్యను ఎదర్కోవాల్సిన దుస్థితి పొంచిఉంది. అనుమతులు ఉన్నా అనధికార నీటి వినియోగం పెరగడం రైతుల మధ్య సాగునీటి యుద్ధాలు నెలకొనే ప్రమాదకర పరిస్థితులు పొంచి ఉన్నాయి. ఇంకా ఇవి మాత్రమే కాకుండా అయా పరిశ్రమలకు సైతం సామర్లకోటనుంచి గోదావరి కాలువ ద్వారా సరఫరా అయ్యే గోదావరి జలాలే ఆధారం. ప్రభుత్వం దీనిపై దృష్టిసారించి ఎత్తిపోతల పథకాల ఆయకట్టుకు సాగునీటి అనుమతులు విషయంలో స్పష్టత వెల్లడించాల్సి ఉందని పీబీసీ కెనాల్ ఆయకట్టు ప్రతినిధి శ్రీనివాస్ కోరారు.

తాగునీటికి గోదావరి జలాలే కీలకం

సామర్లకోట, పెద్దాపురం, కాకినాడ పట్టణాల ప్రజల తాగునీటి అవసరాలు తీర్చే వేసవి జలాశయం, సాంబమూర్తి రిజర్వాయర్‌లకు గోదావరి జలాలే కీలకం. ఇప్పటికే కాకినాడ నగరపాలక సంస్థకు చెందిన ఇంజనీరింగ్ అధికారులు సామర్లకోట లాకులవద్ద 100 అశ్వశక్తి సామర్థ్యంగల రెండు మోటార్ పంప్‌లను నీటిని పంపింగ్ చేసేందుకు సిద్ధం చేశారు. సామర్లకోట, పెద్దాపురం మున్సిపల్ పట్టణాలకు సంబంధించి జలాశయాలను గోదావరి జలాలతో నింపేందుకు మోటార్ పంప్‌లను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఎత్తిపోతల పథకాలకు ముందస్తుగా కాలువలో జలాలను మళ్లిస్తే దిగువన ఉన్న తాగునీటి జలాశయాలకు తాగునీటి నిల్వలకు మాత్రమే కాకుండా పీబీసీ కెనాల్ ఆయకట్టులో సాగునీటికి సైతం ఇబ్బందులు ఏర్పడే ప్రమాదముంది. దీనిపై స్పష్టమైన సమాచారం ఇవ్వాల్సింది కేవలం ఇరిగేషన్ అధికారులపైనే ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఇరిగేషన్ అధికారులు ఎటూ తేల్చకపోతే అంతిమంగా నష్టపోయేది తాగునీటి కోసం మూడు పట్టణాలైన సామర్లకోట, పెద్దాపురం మున్సిపల్ పట్టణాలు, కాకినాడ నగరపాలక సంస్థల ప్రజలు, సామర్లకోట దిగువన ఉండూరు, వీకే రాయపురం కాల్వల వెంబడి ఆయకట్టులో దాళ్వా సాగుచేసే వేలాది ఎకరాల ఆయకట్టు రైతాంగం మాత్రమేనన్న నగ్నసత్యం తెలుసుకోవాల్సిఉంది.

కిరాయి పంచాయితీ!

- కాకినాడ లారీఓనర్స్‌యూనియన్, కేఎస్‌పీఎల్ మధ్య వివాదం
- బొగ్గు రవాణాకు తమ లారీలే వినియోగించాలని కోరిన లారీ యూనియన్
- కిరాయి ధరలు అధికంగా ఉన్నాయంటున్న కేఎస్‌పీఎల్
- మూడురోజులుగా యూనియన్ లారీలను అద్దెకు తీసుకోని కేఎస్‌పీఎల్
- థర్మల్ విద్యుత్ ప్లాంట్‌లకు బొగ్గు సరఫరాపై సందిగ్ధత

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 20(ఆంధ్రజ్యోతి): లారీలకు అద్దె చెల్లించే విషయంలో కాకినాడ లారీ యజమానుల యూనియన్, కాకినాడ సీపోర్టు లిమిటెడ్ (కేఎస్‌పీఎల్) మధ్య వివాదం నెలకొంది. యూనియన్ పంపిస్తున్న లారీల కిరాయి ధరలు అధికంగా ఉన్నాయని కేఎస్‌పీఎల్, బోత్ర సంస్థలు వ్యతిరేకిస్తున్నాయి. దీంతో కాకినాడ పోర్టునుంచి థర్మల్ ప్లాంట్‌లకు సరఫరా అయ్యే బొగ్గుపై సందిగ్ధత నెలకొంది. కాకినాడ సీపోర్టు లిమిటెడ్ బోత్రా వంటి సంస్థలు ఆస్ట్రేలియానుంచి కాకినాడకు దిగుమతి అయ్యే బొగ్గు నిల్వలను దేశంలో వివిధ థర్మల్ విద్యుత్ ప్లాంట్‌లకు సరఫరా చేస్తాయి. దీనికి కాకినాడ లారీ ఓనర్స్ యూనియన్ లారీలనే ఉపయోగిస్తున్నారు. 15ఏళ్లుగా యూనియన్ లారీలనే ప్రధానంగా రాజమహేంద్రవరం, విశాఖపట్నం, ఒడిశాల్లో ప్లాంట్‌లకు ఈ బొగ్గు సరఫరా చేస్తారు. ఇటీవల బొగ్గు సరఫరాకు టన్నుకు అయ్యే ధరలు అధిక శాతంగా ఉన్నాయని కేఎస్‌పీఎల్, బోత్ర సంస్థలు వ్యతిరేకించాయి. లారీల అద్దె ధరలు తగ్గించి బొగ్గు రవాణా చేయకపోతే తామే ఇతర ప్రైవేటు సర్వీసుల నుంచి లారీలను అద్దెకు తీసుకుంటామన్నారు. దీంతో మూడురోజులుగా లారీ యూనియన్ నుంచి లారీలకు అద్దెకు తీసుకోలేదు. దీంతో బొగ్గు రవాణాలో సందిగ్ధత నెలకొంది.

చాంబర్ ఆఫ్ కామర్స్‌లో సమావేశం

దీనిపై సోమవారం కాకినాడ చాంబర్ ఆఫ్ కామర్స్‌లో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. కాకినాడ చాంబర్ ప్రతినిధులు, రాజకీయ ప్రతినిధులు, కాకినాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు చర్చించారు. లారీ యాజమానులు, కేఎస్‌పీఎల్‌కు ఆమోదయోగ్యమైన నిర్ణయాలు తీసుకునే అవకాశంపై చర్చించారు.

సమస్య జిల్లా కలెక్టర్ దృష్టికి..

ఈ వివాదాన్ని లారీఓనర్స్ ప్రతినిధులు జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఈ సమస్య మరింత జటిలం కాకుండా పరిష్కరించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

మహాకుంభమేళాకు అదనపు రైలు నడపాలని వినతి

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 20(ఆంధ్రజ్యోతి): మహాకుంభమేళా సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కాకినాడ టౌన్‌నుంచి ప్రయాగ్‌రాజ్‌కు అదనపు ప్రత్యేక రైలు సర్వీస్ నడపాలని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ కోరారు. ఈమేరకు సోమవారం కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు లేఖ రాశారు. జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు ఉత్తరప్రదేశ్‌లో ప్రయోగ్‌రాజ్‌వద్ద నిర్వహించనున్న మహాకుంభామేళాకు దేశవిదేశాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున హాజరవుతారన్నారు.

జనసేన నాయకుడి పై దాడి

కాకినాడక్రైం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్‌కు సంబంధించిన లావాదేవీల్లో ఏర్పడిన కక్షపూరితమైన ఘర్షణలో జనసేన నాయకుడిపై ఓ వ్యక్తి దాడికి పాల్పడిన సంఘటన సోమవారం కాకినాడలో చోటుచేసుకుంది. జనసేన నాయకుడు దుగ్గన బాబ్జి సోమవారం స్థానిక రిజిస్ట్రార్ ఆఫీస్‌లో ఉండగా కన్నబాబు అనే వ్యక్తి ఒక్కసారిగా ఆయనపై దాడికి పాల్పడ్డాడు. స్థానికులు ఎదురు తిరగడంతో అతడు అక్కడినుంచి పరారయ్యాడు. అనంతరం కాకినాడ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో బాబ్జి ఫిర్యాదు చేయడంతో సీఐ ఎం.నాగదుర్గారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆపాల్సిందే

- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాలతో విచారణ
- యూనివర్సల్ బయోఫ్యూయెల్స్‌లో ఉత్పత్తి నిలుపుదలకు ఆదేశాలు
- అనుమతి లేని ముడిపదార్థాల వినియోగం
- నిర్ధారించిన కాలుష్య నియంత్రణ మండలి బోర్డు

6

వాషింగ్టన్ టు బుష్





40 మంది అమెరికా అధ్యక్షుల చిత్రాలతో డాలర్ నాణేల ముద్రణ

సేకరించిన కాకినాడకు చెందిన నాణేల సేకరణకర్త జానకిరామ చౌదరి



40 మంది అధ్యక్షుల ముఖ చిత్రాలతో ముద్రించిన డాలర్లు

కార్పొరేషన్ (కాకినాడ), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అమెరికా నూతన అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ సోమవారం రెండోసారి ప్రమాణం చేశారు. కాకినాడకు చెందిన ప్రముఖ నాణేల సేకరణకర్త మార్ని జానకిరామ చౌదరి ఇప్పటివరకు విడుదలైన 40మంది అమెరికా అధ్యక్షుల డాలర్లను సేకరించారు. ట్రంప్ మరోసారి అమెరికా అధ్యక్ష పీఠం అధిరోహించిన సందర్భంగా ఆ విశేషాలను తెలియజేశారు. ఇంతవరకు అధ్యక్షులుగా 46మంది పనిచేయగా 40మంది అధ్యక్షుల ముఖచిత్రాలతో ఒక డాలరు విలువ కలిగిన నాణేలను అమెరికా ప్రభుత్వం ముద్రించింది. వెనుక భాగంలో స్టాట్యూ ఆఫ్ లిబర్టీ చిత్రంతో రాగి, జింక్, మాంగనీస్, నికెల్ మిశ్రమ లోహాలతో విడుదల చేశారు.



జానకిరామ చౌదరి

ఒక్కొక్క నాణెం 8.1 గ్రాముల బరువు కలిగి 26.5 మిల్లీమీటర్ల వ్యాసం, 2 మిల్లీమీటర్ల మందం కలిగి ఉంటుంది. మొట్టమొదటి అధ్యక్షుడు జార్జ్ వాషింగ్టన్ (1789-1797)తో ప్రారంభించి జార్జ్ హెచ్‌డబ్ల్యు బుష్ వరకు 40మంది (మరణించిన అధ్యక్షుల) చిత్రాలతో నాణేలను ముద్రించారు. 2007 నుంచి 2011 వరకు పెద్ద సంఖ్యలో చలామణి కోసం ముద్రించారు. కానీ 2012 నుంచి 2017 సంవత్సరం వరకు విడుదలైన నాణేలను కేవలం సేకర్తల కోసం మాత్రమే ముద్రించారు.

ఆకాశంలో హరివిల్లు



యానాం రాజీవ్ గాంధీ బీచ్‌రోడ్డులో సోమవారం ఆకాశంలో అద్భుతమైన హరివిల్లు ఆవిష్కృతమైంది. ఎర్రటి, నీలిరంగు మబ్బులతో చూపరులను కనువిందు చేసింది. ఈ దృశ్యాన్ని యానాం బీచ్‌లోని పర్యాటకులను ఆకట్టుకుంది. దీంతో వారు తమ సెల్‌ఫోన్లలో బంధించారు.

- యానాం

ఆపాల్సిందే

- యూనివర్సల్ బయోఫ్యూయెల్స్‌లో ఉత్పత్తి నిలుపుదలకు ఆదేశాలు
- జంతువుల కొవ్వు, ఫ్యాటీ యాసిడ్స్‌తో కాలుష్యం
- అనుమతి లేని ముడిపదార్థాల వినియోగం
- నిర్ధారించిన కాలుష్య నియంత్రణ మండలి బోర్డు
- డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలతో విచారణ

సర్పవరం జంక్షన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): జంతువుల కొవ్వు ముడి పదార్థాల వినియోగం, దుర్గంధపూరిత దుర్వాసన వెదజల్లుతూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన కంపెనీపై ఎట్టకేలకు అధికారులు చర్యలు తీసుకున్నారు. సముద్ర తీరప్రాంతంలో ఉన్న కంపెనీనుంచి పెద్దఎత్తున దుర్వాసన వెదజల్లుతోందని, విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేశారు. దీనిపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో అధికారులు విచారణ నిర్వహించి అనుమతి లేని ముడిపదార్థాలను ఉపయోగించిందని, పీబీసీ బోర్డు ముందస్తు అనుమతి లేకుండా ముడి పదార్థాలను ఉపయోగించడం.. తిరిగి ప్రారంభించడం వంటి ఉల్లంఘనలకు పాల్పడడంతో దుర్వాసన వెదజల్లడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేసినట్లు అధికారులు గుర్తించారు.

డిసెంబరు రెండో వారంలో ఫిర్యాదు

కాకినాడ రూరల్ మండలం వాకలపూడి ఇండస్ట్రియల్ పార్కులో యూనివర్సల్ బయోఫ్యూయెల్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ పారిశ్రామిక యూనిట్లనుంచి దుర్వాసన వస్తుందని ప్రజలు అధికారులకు డిసెంబరు రెండో వారంలో ఫిర్యాదు చేశారు. ప్రజల ఫిర్యాదుల మేరకు డిప్యూటీ సీఎం పవన్ ఆదేశాల మేరకు డిసెంబరు 20, 21వతేదీల్లో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పీబీసీ బోర్డు అధికారులు తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో గుర్తించిన ఉల్లంఘనలు, లోపాలపై మానిటరింగ్ కమిటీ సమావేశం డిసెంబరు నెలాఖరున నిర్వహించారు. జంతువుల టాలో ఆయిల్ అందుకుని, ప్రిగోరిఫికో అల్లానా ప్రైవేట్ లిమిటెడ్, ఔరంగాబాద్, మహారాష్ట్ర ప్రాంగణంలోని నిల్వ ఉన్న ట్యాంకుల్లో 4.535టన్నుల క్రూడ్ యానిమల్ టాలో ఆయిల్ నిల్వ చేసినట్లు గుర్తించారు. నిల్వ చేసిన టాలో ఆయిల్ రిఫైన్డ్ లేదా క్రూడ్ అని నిర్ధారించేందుకు నిల్వ ట్యాంకుల్లో(ట్యాంకు నెంబరు 6003), యానిమల్ టాలో ఆయిల్‌లోని ఫ్రీ ఫ్యాటీయాసిడ్(ఎఫ్ఎఫ్ఏ) కంటెంట్‌ను పొల్యూషన్ నియంత్రణ బోర్డు (పీబీసీ) అధికారులు గుర్తించారు. శుద్ధి చేసిన టాలో ఆయిల్‌లో 0.20శాతం నుంచి 0.62నుంచి 0.69శాతం వరకు నిల్వ చేసిన యానిమల్ టాలో ఆయిల్ ఫ్రీ ఫ్యాటీ యాసిడ్(ఎఫ్ఎఫ్ఏ) 0.62నుంచి 0.69 పరిధిలో ఉన్నట్లు గుర్తించారు. ఇది నిబంధనలకు వ్యతిరేకంగా పరిశ్రమ శుద్ధి చేయకుండా ముడి జంతు నూనె ఉపయోగిస్తుందని అధికారులు గుర్తించారు. పరిశ్రమ తమ డియోడరైజర్ ప్లాంట్‌లోని క్రూడ్ టాలో ఆయిల్‌లో ఎఫ్ఎఫ్ఏను తగ్గిస్తోందని, స్క్రబ్బర్‌ను వాతావరణంలోకి విడుదల చేసిన తర్వాత ఘనీభవించిన వాయువులు(కీటోన్స్, అమైన్‌లు) నేరుగా విడుదల చేయడంతో తీరప్రాంత గ్రామాలతోపాటు రమణయ్యపేట, వలసపాకల, తిమ్మాపురం తీవ్రమైన దుర్వాసన వెదజల్లినట్లు నిర్ధారించినట్లు కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శంకరరావు తెలిపారు. దీంతోపాటు నవంబరు, డిసెంబరు నెలల్లో 165.46 టన్నుల జెమినీ, ఎడిబుల్ ఆయిల్, ఫ్యాట్స్ ఇండియానుంచి 92.67 టన్నులు, అదానీ విల్మార్‌నుంచి 72.79 టన్నులు యాసిడ్ ఆయిల్ పొంది సమీపంలో యాసిడ్ ఆయిల్‌ని ఉప ఉత్పత్తిగా ఉత్పత్తి చేస్తూ నిబంధనలకు తిలోదకాలు ఇచ్చినట్లు గుర్తించామన్నారు. 2024లో బయో డీజిల్ ఉత్పత్తిలో ఎడిబుల్ ఆయిల్ యూనిట్లు ఉపయోగిస్తామన్నారు. దీంతో ఈ ప్రాంతంలో తీవ్ర దుర్వాసన వెదజల్లి మరింత పెంచడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యాయన్నారు. యూనివర్సల్ బయోఫ్యూయల్స్ సంస్థ నిబంధనలు ఉల్లంఘించడంతో కంపెనీ ఉత్పత్తిని నిలుపుదల చేస్తూ కలెక్టర్ ఆదేశాల మేరకు ఉత్తర్వులు జారీ చేశామన్నారు. ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా పరిశ్రమ తదుపరి కార్యకలాపాలు అన్నింటినీ తక్షణమే నిలిపివేయాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. 2018లో కూడా ఈ కంపెనీ యానిమల్ ఫ్యాట్, టాలో ఆయిల్ వంటి ముడి పదార్థాలు నిబంధనలకు విరుద్ధంగా వినియోగించడంతో ఆరునెలలపాటు కంపెనీలో కార్యకలాపాలు జరగకుండా మూసివేత ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఉత్తర్వులకు వ్యతిరేకంగా పరిశ్రమ కార్యకలాపాలు నిర్వహించినట్లు తేలితే కాలుష్య నివారణ, నియంత్రణ సవరణ చట్టం, 1988లో సెక్షన్ 41(2) ప్రకారం వాయు కాలుష్య నివారణ, నియంత్రణ చట్టం ప్రకారం మొదటి తరగతి న్యాయస్థానంలో ప్రాసిక్యూషన్‌కు గురవుతారని హెచ్చరించారు.

హోరాహోరీగా బ్రాహ్మణ పురోహితుల క్రికెట్ పోటీలు



హర్షకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందిస్తున్న పట్టణ సీఐ వీరబాబు

అమలాపురం టౌన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కోనసీమ బ్రాహ్మణ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్రస్థాయి బ్రాహ్మణ పురోహిత క్రికెట్ టోర్నమెంటు పోటీలు మూడోరోజు హోరాహోరీగా జరిగాయి. అమలాపురం కిమ్స్ వైద్య కళాశాల క్రీడా ప్రాంగణంలో సోమవారం అన్నవరం-నర్సీపట్నం జట్ల మధ్య పోటీ హోరాహోరీగా సాగింది. ఈ పోటీలో అన్నవరం జట్టు విజయం సాధించింది. కాకినాడ రుద్రాస్-వైజాగ్ లయన్స్ జట్ల మధ్య పోటీలో కాకినాడ రుద్రాస్ విజయం సాధించింది. నర్సీపట్నం-కాత్రేనికోన జట్ల మధ్య పోరులో నర్సీపట్నం జట్టు విజయం సాధించింది. అన్నవరం జట్టు క్రీడాకారుడు హర్ష మ్యాన్ ఆఫ్ దిమ్యాచ్‌గా ఎంపిక కాగా పట్టణ సీఐ పి.వీరబాబు షీల్డు అందజేశారు. కాకినాడ రుద్రాస్ జట్టు కెప్టెన్ మాధవశర్మ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచారు. బీజేపీ జిల్లా శాఖ అధ్యక్షుడు యాళ్ల దొరబాబు షీల్డు అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు, పాలూరి సత్యానందంతో పాటు పలువురు రాజకీయ రంగ ప్రముఖులు క్రీడా పోటీలను తిలకించారు. కర్రా శివయ్య, పిండి మూర్తి, వేదుల భరద్వాజ శర్మ తదితరులు పాల్గొన్నారు.

అత్యాధునిక సాంకేతికత.. స్మార్ట్ మెటీరియల్స్‌పై దృష్టి

ఇన్‌ఛార్జి వీసీ మురళీకృష్ణ

జేఎన్టీయూకే, జనవరి 20(ఆంధ్రజ్యోతి): అత్యాధునిక సాంకేతికత, స్మార్ట్ మెటీరియల్స్‌పై దృష్టిసారించడంతో పాటు పునరుత్పాదక ఇంధన వ్యవస్థలను ఆప్టిమైజ్ చేసేందుకు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ఉపయోగపడుతుందని ఇన్‌ఛార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. యూసీఈకే మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఏఐసీటీఈ ట్రైనింగ్ లెర్నింగ్(అటల్) అకాడమీ సహకారంతో ఈనెల 25వరకూ ఆరురోజులపాటు నిర్వహించే ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఇన్ ఆప్టిమైజింగ్ రెన్యూవబుల్ ఎనర్జీ సిస్టమ్ విత్ స్మార్ట్ మెటీరియల్స్ స్టోరేజ్ సొల్యూషన్స్ అంశంపై జాతీయస్థాయి ఆన్‌లైన్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను సోమవారం వీసీ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వచ్చే 50 ఏళ్లలో ప్రపంచం మొత్తం వీటిపై ఆధారపడే ముందుకు వెళుతుందన్నారు. మొత్తం 9 రాష్ట్రాల నుంచి 138 మంది అధ్యాపకులు ఎఫ్‌డీపీకి హాజరవుతున్నారన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, ప్రిన్సిపాల్ మోహన్‌రావు పాల్గొనగా వీవీ సుబ్బారావు సమన్వయకర్తగా వ్యవహరించగా డాక్టర్ డి.లింగరాజు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు, రిసోర్స్‌పర్సన్‌లు పాల్గొన్నారు.

మనసువిప్పి మాట్లాడుకుంటే సమస్యలు పరిష్కారం

- సందేశాత్మకంగా సాగిన 'విడాకులు కావాలి' నాటిక
- భోగాపురంలో ముగిసిన జాతీయస్థాయి నాటికల పోటీలు
- ఉత్తమ ప్రదర్శనగా 'నా శత్రువు' నాటిక ఎంపిక

మనసువిప్పి మాట్లాడుకుంటే దంపతుల మధ్య సమస్యల పరిష్కారమవుతాయి. అంతేగాని పంతాలకు వెళ్లి విడాకులకు దారితీసే పరిస్థితులు తెచ్చుకోవద్దని సందేశమిస్తూ సాగింది గుంటూరుజిల్లా తాడేపల్లి అరవింద ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించిన విడాకుల కావాలి నాటిక.



జాతీయస్థాయి నాటిక పోటీల్లో ప్రదర్శించిన విడాకులు కావాలి నాటికలోని సన్నివేశం

పిఠాపురం/పిఠాపురం రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా పిఠాపురం మండలం భోగాపురం గ్రామంలో భోగాపురం నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న కొణిదెల పవన్‌కల్యాణ్ జాతీయస్థాయి నాటికల పోటీలు నాల్గవరోజు ప్రదర్శించిన ఈ నాటిక ప్రస్తుతం చిన్న చిన్న విభేదాలతో విడిపోతున్న దంపతులకు హితవు పలుకుతూ దాంపత్య జీవితం ఎలా ఉండాలో వివరించింది. అహంకారంతో పట్టుదలకు పోకుండా సర్దుబాటు ధోరణితో సంయనం పాటించడం ద్వారా ఆదర్శ దంపతులా గడపవచ్చునని చాటిచెప్పింది. భారతీయ వివాహ వ్యవస్థలో మన సంస్కృతి సంప్రదాయాలే దాంపత్య జీవితాలను అన్యోన్యంగా నడిపే దారిదీపాలని, ఇచ్చిపుచ్చుకునే సంస్కారం దాంపత్యాన్ని ఆనందమయం చేస్తుందని తెలియజెప్పింది. వల్లూరి శివప్రసాద్ ఈ నాటికను రచించగా, గంగోత్రి సాయి దర్శకత్వం వహించారు.

ముగిసిన నాటిక పోటీలు

భోగాపురంలో నాలుగు రోజులపాటు జరిగిన జాతీయస్థాయి నాటికల పోటీలు సోమవారం తెల్లవారుజామున ముగిశాయి. ఉభయ తెలుగు రాష్ట్రాలు, కర్నాటక రాష్ట్రం నుంచి వచ్చిన కళాకారులు తొమ్మిది నాటికలను ప్రదర్శించారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రదర్శనగా హైదరాబాద్‌కు చెందిన యువభేరి థియేటర్ ఆర్గనైజేషన్ కళాకారులు ప్రదర్శించిన నా శత్రువు నాటిక ఎంపిక కాగా, ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా ద్వారబంధాల చంద్రయ్యనాయుడు(గుడివాడ కృష్ణ ఆర్ట్ అండ్ కల్చరల్ అసోసియేషన్), తృతీయ ప్రదర్శనగా ఇది రహదారి కాదు (హైదరాబాద్ మిత్ర క్రియేషన్స్), ఉత్తమ జ్యూరీ ప్రదర్శనలుగా అసత్యం (ఉక్కునగరం చైతన్య కళాస్రవంతి), ఉక్కు సంకెళ్లు(హైదరాబాద్ మహతి క్రియేషన్స్) నాటికలు ఎంపికయ్యాయి. ఉత్తమ రచనగా ఇది రహదారి కాదు నాటిక రచయిత ఆకురాతి భాస్కరరావు, ఉత్తమ దర్శకత్వం పి.కృష్ణహితేష్(ద్వారబంధాల చంద్రయ్యనాయుడు), ఉత్తమ నటుడిగా పి.బాలాజీనాయక్(అసత్యం), ఉత్తమ నటిగా సునయన (నా శత్రువు), ఉత్తమ విలన్‌గా శరత్‌కుమార్(ఉక్కుసంకెళ్లు), ఉత్తమ ద్వితీయ నటుడిగా జరుగుల రామారావు(ప్రేమించే వయసేనా), ద్వితీయ నటిగా బండారు నాగరాణి (ఇది రహదారి కాదు), ఉత్తమ బాలనటిగా యష్మిత(నా శత్రువు), ఉత్తమ సహాయ నటుడిగా మురళీమోహన్(చీకటి బతుకులు), సహాయ నటిగా వసంతయామిని(విడాకులు కావాలి), ఉత్తమ సంగీతం సురభి నాగరాజు(ఇది రహదారి కాదు), ఉత్తమ ఆహార్యంగా వీవీ సత్యనారాయణ(ద్వారబంధాల చంద్రయ్యనాయుడు), ఉత్తమ రంగాలంకరణగా థామస్(విడాకులు కావాలి), ఉత్తమ రంగోద్దీపనగా కృష్ణహితేష్(ద్వారబంధాల చంద్రయ్యనాయుడు), ప్రత్యేక ప్రశంసగా చీకటి బతుకులు నాటిక, నటుడిగా ఎస్ఎస్ఎస్ ప్రసాద్(ద్వారబంధాల చంద్రయ్యనాయుడు ఎంపికయ్యారు. వీరికి భోగాపురం నాటక కళాపరిషత్ అధ్యక్షుడు అడపా సూరిబాబు, మార్కండేయ నాటక కళాపరిషత్ అధ్యక్షుడు న్యాయవాది పడాల రవి, పలువురు ప్రముఖ కళాకారుల ద్వారా నగదు పురస్కారాలు, వారాహి అవార్డులు అందజేశారు. ఈ నాటికల పోటీలకు న్యాయనిర్ణేతలుగా మహ్మద్ ఖాజావలీ, ఎంవీ రమణ, ఎం.తాతికొండలు వ్యవహరించారు.





జాతీయస్థాయి నాటికల పోటీల్లో ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైన నా శత్రువు నాటికకు వారాహి అవార్డు, ఉత్తమ పురస్కారాన్ని అందజేస్తున్న భోగాపురం నాటక కళా పరిషత్ ప్రతినిధులు, ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైన ద్వారబంధాల చంద్రయ్యనాయుడు నాటికకు పురస్కారం, వారాహి అవార్డు అందజేస్తున్న దృశ్యం

రేపు బాలికల హాకీ జిల్లా జట్టు ఎంపిక

కాకినాడఅర్బన్, జనవరి20 (ఆంధ్రజ్యోతి): బాలికల సబ్ జూనియర్ హాకీ జిల్లా జట్టు ఎంపిక ఈనెల 22న కాకినాడ డీఎస్ఏ మైదానంలో మధ్యాహ్నం 3గంటలకు నిర్వహిస్తారని హాకీ సంఘం జిల్లా కార్యదర్శి నంబు శ్రీనివాసరావు తెలిపారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు జనవరి 1, 2009 తరువాత జన్మించినవారై ఉండాలన్నారు. ఎంపికైన జట్టు ఈనెల 27నుంచి 29వరకు అనంతపురంలో జరిగే అంతర్‌జిల్లాల సబ్ జూనియర్ బాలికల హాకీ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారన్నారు.

రెండోరోజు అలరించిన గాత్ర కచేరీ



గాత్ర కచేరి నిర్వహిస్తున్న దృశ్యం

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సంగీత విద్వత్సభ కాకినాడ వారి ఆధ్వర్యంలో సూర్యకళామందిరంలో సంక్రాంతి గాన సభల పదిరోజుల కార్యక్రమాల్లో రెండోరోజు పతంగి సోదరుల(శ్రీ దాత్రే, ధృవ్) చెన్నైవారి గాత్ర కచేరి అద్భుతంగా జరిగింది. వారు సౌరాష్ట్ర రాగంలో శరణు సిద్ధి వినాయక, విద్వాన్ చిత్రవీణ ఎన్.రవికిరణ్ శ్రీశైలం మల్లిఖార్జునేశ్వరుడిపై కేదారగౌళ రాగంలో రచించిన ద్వాదశ జ్యోతిర్లింగ గీత మాల రేయి పగలు నిన్నే నమ్మినాడు, పంతువరాళి రాగంలో ఎన్నగాను రామభజన, కమాస్ రాగంలో బ్రోచేవారెవరురా కీర్తనలు గానంచేసి మైమరపించారు. వీరికి వయొలిన్‌పై బండే మాధవన్, చెన్నై, మృదంగంపై కె.యోగీష్, ఘటంపై శ్రీ సరస్వతుల హనుమంతరావు చక్కటి సహకారాన్ని అందించారు. ఆలపాటి లక్ష్మి సుభద్ర, సుభాషిణి, పంతం నాగేశ్వరి, చావలి సూర్యకుమారి, కె.సుబ్బలక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేశారు.

దేశం గర్వించదగ్గ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలి

- కల్నల్ హెచ్ఎస్ మానిక్
- శ్రీప్రకాష్‌లో కొనసాగుతున్న చెస్ పోటీలు

పెద్దాపురం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : దేశం గర్వించదగ్గ సాటి మేటి క్రీడాకారులుగా తీర్చిద్దిబడాలని మూడో ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ హెచ్ఎస్ మానిక్ అన్నారు. స్థానిక శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలలో ఐదురోజులపాటు జరగనున్న జాతీయస్థాయి స్కూల్ చెస్ ఛాంపియన్‌షిప్ పోటీల నాల్గవ రోజు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా సోమవారం హాజరై మాట్లాడారు. క్రీడాకారులు దేశానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. చెస్ క్రీడ ద్వారా మేథస్సు పెంపొందించుకోవచ్చని పేర్కొన్నారు. అత్యుత్తమ ప్రతిభను కనబరిచి దేశానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం చెస్ క్రీడలను తిలకించారు. కల్నల్ మానిక్‌ను పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయవాది నరసింహన్, వైడీ రామారావు, డాక్టర్ విజయనరసింహన్, డీఎఫ్‌వో వీరన్న, పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.



కల్నల్ మానిక్‌ను సత్కరిస్తున్న శ్రీప్రకాష్ పాఠశాల డైరెక్టర్ విజయ్‌ప్రకాష్

లలితా జ్యూయలరీ తునికి రావడం

శుభ పరిణామం

- మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు
- తునిలో అట్టహాసంగా లలితా జ్యూయలరీ ప్రారంభోత్సవం



లలితా జ్యూయలరీ అధినేత కిరణ్‌కుమార్‌తో కలిసి షోరూమ్‌ను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు



సంస్థ చైర్మన్‌తో కలిసి మీడియాతో మాట్లాడుతున్న యనమల రామకృష్ణుడు

తుని రూరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ నగల వ్యాపార సంస్థ లలితా జ్యూయలరీ తునికిరావడం శుభ పరిణామమని మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. తునిలో లలితా జ్యూయలరీ 59వ షోరూం సోమవారం అట్టహాసంగా ప్రారంభమైంది. తుని మెయిన్‌రోడ్డులో నూతన హంగులతో రూపుదిద్దుకున్న లలితా జ్యూయలరీ మాల్‌ను మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, లలితా జ్యూయలరీ అధినేత డాక్టర్ ఎం.కిరణ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకుడు యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ గతం మాదిరిగా తునిలో అరాచక పరిస్థితులు లేవని, కూటమి ప్రభుత్వం రాకతో తునిలో ప్రశాంత వాతావరణం నెలకొందన్నారు. ఫలితంగా వ్యాపార కేంద్రంగా ఎంతో అభివృద్ధి చెందిన తునికి కార్పొరేట్ సంస్థలు వ్యాపారాలు నిర్వహించేందుకు ముందుకు వస్తున్నాయన్నారు. పెద్దఎత్తున వ్యాపార సంస్థలు కొలువు తీరితే తుని పట్టణం అభివృద్ధి చెందుతుందని, క్రయ విక్రయాలు జరుగుతూ ఉంటే ట్యాక్స్‌ల రూపాన ప్రభుత్వానికి ఆదాయం వస్తోందని, ఆదాయం వస్తే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్నారు. దీంతోపాటుగా యువతకు ఉపాధి అవకాశాలు సాధ్యమవుతాయని యనమల స్పష్టం చేశారు. లలితా జ్యూయలరీ చైర్మన్ డాక్టర్ ఎం.కిరణ్‌కుమార్ తనకు వ్యక్తిగతంగా ఆత్మీయుడని ఆయన ఆహ్వానం మేరకు తునిలో లలితా జ్యూయలరీ షోరూంను ప్రారంభించడం ఆనందాన్ని ఇచ్చిందన్నారు. లలితా జ్యూయలరీ అధినేత డాక్టర్ ఎం.కిరణ్ కుమార్ మాట్లాడుతూ బంగారం కొనుగోలు ఇప్పుడు సాధారణ విషయంకాదని, నగలు కొనేటప్పుడు చాలా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అచ్చొచ్చిన చోటు అని ఎన్నో సంవత్సరాలు ఒకేచోట కొంటున్నామనే ఉద్దేశంతో అధిక ధరలకు, అధిక తరుగుకు నగలు కొనడం కరెక్ట్‌కాదని స్పష్టం చేశారు. తెలివైన నిర్ణయంతో నగలు కొనాలని కోరారు. లలితా జ్యూయలరీలో నగలు కొనాలని చెప్పడం లేదని లలితలో మీకు నచ్చిన నగదుకు ఎస్టిమేట్ స్లిప్ ఫోటోలు తీసుకుని నాలుగైదు షోరూంలో ధరలు పోల్చి ఎక్కడ ధర తక్కువో అక్కడే నగలు కొనుగోలు చేయాలని తెలిపారు. ఇలా పోల్చిచూడమని ఇతర నగల షోరూంలు చెప్పిన దాఖలాలు ఉన్నాయా అని ప్రశ్నిస్తూ ఇది మా పారదర్శకత అని తెలిపారు. తుని ప్రజలతో తనకు మరింత అనుబంధం ఏర్పడిందని తెలుగుతనం ఉట్టిపడే ఈ ప్రాంతంలో కొత్తషోరూం ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ప్రారంభోత్సవ ఆఫర్‌గా అన్ని బంగారు నగలుపై మార్కెట్ కంటే 2శాతం తగ్గింపుతోపాటుగా వజ్రాభరణాలు క్యారెట్‌కు రూ.6వేలు తగ్గిస్తున్నట్లు తెలిపారు. తొలిరోజు నగలు కొనుగోలు చేసేందుకు తరలి రావడంతో మెయిన్‌రోడ్డు సందడిగా మారింది. డబ్బులు ఊరికే రావంటూ తెలుగు రాష్ట్ర ప్రజానీకానికి సుపరిచితుడై తన షాపులకు తానే ఒక బ్రాండ్ అంబాసిడర్‌గా గుర్తింపు పొందిన కిరణ్‌కుమార్‌తో కొనుగోలుదారులు ఫొటోలు దిగేందుకు పోటీ పడ్డారు. సంస్థ చైర్మన్ కిరణ్ కుమార్ ఆద్యాత్మం ఆత్మీయ పలకరింపుతో అందరినీ ఆకట్టుకుంటూ లలితా జ్యూయలరీ మాల్ ప్రారంభోత్సవంలో ఎట్రాక్షన్‌గా నిలిచారు.

ఏపీఎస్పీ బెటాలియన్‌ను సందర్శించిన డీజీపీ తిరుమలరావు



డీజీపీకి మొక్క ఇచ్చి స్వాగతం పలుకుతున్న కమాండెంట్ దీపిక పాటిల్

సర్పవరం జంక్షన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ రమణయ్యపేట ఏపీఎస్పీ 3వ బెటాలియన్‌ను రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏపీఎస్పీ ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం బెటాలియన్‌కు చెందిన ఇంగ్లీషు మీడియం పాఠశాల విద్యార్థులతో ముచ్చటించి, సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ఏపీఎస్పీ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్, కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ కృష్ణారావు, కమాండెంట్ దీపిక పాటిల్, అసిస్టెంట్ కమాండెంట్ దేవానంద రావు తదితరులున్నారు.



ఆర్టీసీ డిపోలో మాట్లాడుతున్న డీజీపీ

కాకినాడ ఆర్టీసీ డిపో సందర్శన

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర డీజీపీ, రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు సోమవారం కాకినాడ డిపోను సందర్శించారు. డిపో పరిసరాలను పరిశీలించి గ్యారేజ్‌లో ఏర్పాటు చేసిన సిబ్బంది సమావేశంలో పాల్గొన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కండక్టర్స్ ఎన్‌జీ.రావు, వీఎస్.మూర్తికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో విజయవాడ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గొల్ల విజయరత్నం, కాకినాడ జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.శ్రీనివాసరావు, కాకినాడ డిపో మేనేజర్ ఎంయువి మనోహర్, అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, అసిస్టెంట్ ఇంజనీర్ కె.ప్రభాకరావు, డీపీటీవో ఆఫీస్ అసిస్టెంట్ మేనేజర్ ఎస్‌కెఎం.భాషా, పీఆర్వో సీహెచ్ వెంకట్‌రాజు పాల్గొన్నారు.

బస్సు రూపంలో మృత్యువు

● రాజమహేంద్రవరంలో బైక్‌ను ఢీకొన్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు ● గంటల తేడాలో మేనమామ, మేనల్లుడు మృతి

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): తన మావయ్యను ఇంటి వద్ద దింపడానికి బైక్‌పై బయలుదేరిన యువకుడు తన మామతో పాటు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు రూపంలో మృత్యువు కబళించింది. ఈ సంఘటన రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల సెంటర్‌లో ఆది వారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే రాజమహేంద్రవరం లాలాచెరువు సమీపంలోని చౌడేశ్వర్‌నగర్‌కు చెందిన మేడిశెట్టి ప్రసాద్ (53) అంబేడ్కర్‌వాది. అతడు ఆదివారం పంగిడిలో జరిగిన ఎయిమ్ సమావేశానికి వెళ్లాడు. సమావేశం అనంతరం వేరొకరి కారులో రాత్రి 10 గంటలు దాటాక రాజమహేంద్రవరం దానవాయిపేటలో నివాసం ఉంటున్న అతడి మేనల్లుడు నక్క సాయికృష్ణ (23) వద్దకు వచ్చారు. విజయవాడకు చెందిన సాయికృష్ణ రాజమహేంద్రవరంలోని మెడికల్ కంపెనీలో మూడేళ్లుగా పనిచేస్తూ ఇక్కడే ఉంటున్నాడు. ఈ క్రమంలో ప్రసాద్ అతడి వద్దకు వచ్చి తనను లాలాచెరువులోని ఇంటి వద్ద దింపాలని అడిగారు. దీంతో తెలిసిన వ్యక్తి వద్ద బైక్ తీసుకుని నెహ్రూనగర్ మీదుగా ఆర్ట్స్ కళాశాల సెంటర్‌కు చేరుకుని రోడ్డు దాడుతుండగా డివైడర్ వద్దకు వచ్చి అటు వైపు నుంచి ఆటో వస్తుందని ఆగారు. ఇంతలో లాలాచెరువు వైపు నుంచి వస్తున్న కాకినాడ-హైదరాబాద్ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు వేగంగా వచ్చి వారి బైక్ వెనుక భాగంలో బలంగా ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే బస్సును నిలుపుదల చేసి పోలీసులకు సమాచారం అందించారు. క్షతగాత్రులను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అర్ధరాత్రి ఇద్దరి పరిస్థితి విషమించి గంటల తేడాలో మృతిచెందారు. కాగా మేడిశెట్టి ప్రసాద్ ఆటోనగర్‌లో వెల్డర్‌గా పనిచేస్తున్నాడు. అతడికి భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. సాయికృష్ణకు తల్లిదండ్రులు ఉన్నారు. కుటుంబానికి అతడే దిక్కు. ఈ ప్రమాదం రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. ఈ మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రోడ్డు ప్రమాదం ప్రదేశంలో పడి ఉన్న ప్రసాద్, సాయి కృష్ణ

పాపికొండలకు ఎస్టీ కమిషన్ చైర్మన్



బోటులో వెళ్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్

దేవీపట్నం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పాపికొండలు విహారయాత్రకు ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు, మరికొంతమంది ప్రజా ప్రతినిధులు పర్యాటక బోటుపై సోమవారం వెళ్లారు. గండిపోశమ్మ తల్లి ఆలయ సమీపంలోని బోటు పాయింటు వద్ద విహార యాత్ర ప్రారంభించారు. చైర్మన్ రాకతో గోదావరి నదీ పరివాహక ప్రాంతమంతా పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. బాంబ్, డాగ్ స్క్వాడ్‌లతో ప్రత్యేకంగా తనిఖీలు జరిపారు.

పోలవరం భూసేకరణ ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్‌గా అభిషేక్

రాజమహేంద్రవరం, జనవరి20 (ఆంధ్రజ్యోతి): పోలవరం భూసేకరణ (ఆర్అండ్ఆర్) ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్‌గా ఐఏఎస్ అధికారి వి.అభిషేక్ నియమితులయ్యారు. ఆయన ఇంతవరకూ పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసరుగా పనిచేశారు. ఈ మేరకు ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

బంగారం కోసం బలి తీసుకున్నాడు!

మహిళ అనుమానాస్పద మృతి

మిస్టరీని ఛేదించిన పోలీసులు

నిందితుడి అరెస్టు



మరణించిన మహాలక్ష్మి (ఫైల్‌ఫొటో)

ద్రాక్షారామ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం తోటపేటలో మహిళ అనుమానాస్పద మృతి కేసు మిస్టరీ వీడింది. బంగారం కోసం మహిళను గొంతు నులిమి హత్య చేసినట్టు దర్యాప్తులో పోలీసులు తేల్చారు. సీఐ వెంకటనారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తోటపేటకు చెందిన దామిశెట్టి మహాలక్ష్మి అలియాస్ ఇడ్లీ లక్ష్మి(54) తోట త్రిమూర్తులు కాలనీలో ఒంటరిగా నివసిస్తున్నది. ఈనెల 12న ఇంట్లో ఆమె మరణించింది. ఈ మరణంపై అనుమానం రాకపోవడంతో బంధువులు ఆమె మృతదేహాన్ని క్రైస్తవ సంప్రదాయం ప్రకారం ద్రాక్షారామ శ్మశానవాటికలో పూడ్చిపెట్టారు. ఇంట్లో ఆమె బంగారు వస్తువులు కనిపించకపోవడంతో అల్లుడు, బంధువులకు అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పూడ్చిపెట్టిన మృతదేహాన్ని తీయించి పోస్టుమార్టం జరిపారు. అనంతరం కేసు విచారణ చేపట్టారు. తోటపేటకు చెందిన నాగిరెడ్డి అప్పారావు అలియాస్ బాబి ఆమెను హత్య చేసి బంగారం గొలుసు, వేలికి ఉంగరం తీసుకెవెళ్లినట్టు దర్యాప్తులో తేల్చారు. సోమవారం నిందితుడిని అరెస్టు చేసి చోరీ సొత్తు స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపర్చి రిమాండుకు తరలించినట్టు సీఐ తెలిపారు.

పట్టించిన బంగారు వస్తువులు

ఈ హత్యకేసులో నిందితుడిని బంగారు వస్తువులు పట్టిచ్చాయి. ఆమె మృతిపై తొలుత అనుమానం రాకపోవడంతో బంధువులు అంత్యక్రియలు చేశారు. తదుపరి బంగారు వస్తువుల కోసం వెతకగా కనిపించలేదు. దీంతో ఆమె అల్లుడు, బంధువులు మహాలక్ష్మి పనిచేసే స్టీలు హౌస్‌కు వెళ్లి వాకబు చేశారు. ఈనెల 11న బంగారు వస్తువులు వేసుకుని ఆమె పనికి వచ్చినట్టు స్టీలు హౌస్ యజమాని తెలిపారు. దీంతో అనుమానం మరింత బలపడింది. బంగారు వస్తువుల ఫొటోలతో తాకట్టు దుకాణాల వద్దకు వెళ్లి విచారించారు. ద్రాక్షారామలోని ఒక బంగారం షాపు వద్ద నిందితుడు అప్పారావు తాకట్టు పెట్టినట్టు తేలింది. దీంతో ఆమె అల్లుడు సురేష్ తన అత్త మృతిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల విచారణతో మిస్టరీ వీడింది.

'అన్నవరం' ఖజానాకు రూ.81.84 లక్షలు

దేవస్థానంలో ఫొటోలు తీసుకునే లైసెన్స్‌కు టెండర్ కం బహిరంగవేలం

అన్నవరం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో దర్శనం, వ్రతమాచరించుకునే భక్తులకు, పోలరైడ్ ఫొటోలు తీసుకునే లైసెన్స్ హక్కు ద్వారా స్వామివారి ఖజానాకు ఏడాదికి రూ.81.84 లక్షలు ఆదాయం దక్కనుంది. సోమవారం నిర్వహించిన టెండర్ కం బహిరంగవేలం నిర్వహించగా నెలకు రూ.6.82 లక్షలు దేవస్థానానికి చెల్లించేందుకు గుత్తేదారు ముందుకొచ్చారు. ఇదే లైసెన్స్ హక్కుకు గతేడాది రూ.53.40 లక్షలు ఆదాయం లభించింది. పోలరైడ్ ఫొటోలు లైసెన్స్ ద్వారా రికార్డుస్థాయి ఆదాయం వచ్చిందని అధికారులు వెల్లడించారు. వీటితోపాటుగా వివిధ ప్రాంతాల్లో టీ, కాఫీ విక్రయించేందుకు రెండు దుకాణాలకు వేలం నిర్వహించగా ఏడాదికి ఒకషాపునకు రూ.3లక్షలు, మరో షాపునకు రూ.3.48 లక్షలు హెచ్చుపాటలు వెళ్లినట్లు దేవస్థానం లీజుల విభాగం అధికారులు తెలిపారు.

మాజీ మంత్రి పితాని పూజలు

అన్నవరం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో సోమవారం మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ పీఆర్వో కృష్ణారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.



వేదాశీర్వచనం అందుకుంటున్న పితాని

త్రుటిలో తప్పిన ప్రమాదం

పంట పొలంలోకి దూసుకుపోయిన ఓల్వా బస్

50 మంది ప్రయాణికులు సురక్షితం



పొలంలోకి దూసుకుపోయిన బస్

ప్రత్తిపాడు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు జాతీయ రహదారిపై సోమవారం పంట పొలంలోకి ఓల్వా బస్సు దూసుకువెళ్లింది. స్థానిక బైపాస్ రహదారిలో విశాఖ నుంచి హైదరాబాద్ వెళ్లే ఓల్వా బస్సు అదుపు తప్పి పంట పొలంలోకి దూసుకువెళ్లింది. బస్సులో 50 మంది ప్రయాణికులు ఉండగా ఎవరికీ గాయాలు కాలేదు. దీంతో త్రుటిలో ప్రమాదం తప్పినట్టు అయింది. టైర్ పంక్చర్ అవడం వల్లే బస్సు అదుపు తప్పిందని స్థానికులు తెలిపారు. దీంతో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి



గింజాల బాల (ఫైల్)

కొత్తపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతిచెందిన సంఘటన కాకినాడ జిల్లా మూలపేటలో సోమవారం జరిగింది. స్థానిక ప్రకాష్‌నగర్‌కు చెందిన రాచపల్లి ప్రసాద్ అదే గ్రామానికి చెందిన గింజాల బాల(25)ను 8 ఏళ్ల కిందట ప్రేమవివాహం చేసుకున్నాడు. ఇటీవల ప్రసాద్ వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో తరచూ గొడవలు జరిగేవని బాలతల్లి గింజాల లక్ష్మి తెలిపింది. తన కుమార్తెను వదిలించుకోవాలనే ఉద్దేశ్యంతో అత్తింటి వారే హత్య చేసి మృతదేహాన్ని గుట్టుచప్పుడు కాకుండా పూడ్చిపెట్టారని కొత్తపల్లి పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసింది. మృతురాలి తల్లి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

రావులపాలెం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రావులపాడు జాతీయ రహదారి వంతెన సమీపంలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్టు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం... 30ఏళ్ల పైబడి ఉన్న పురుష మృతదేహంపై ఎరుపు రంగు షర్ట్, లేత గోధుమరంగు కాటన్ ప్యాంట్ ఉన్నాయి. చనిపోయిన వ్యక్తి లారీ క్లీనర్ గాని డ్రైవర్ అయి ఉండవచ్చని తెలిపారు. మృతదేహాన్ని కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించి బంధువులు గుర్తుపట్టేందుకు మార్చురీలో ఉంచినట్టు పోలీసులు చెప్పారు.



రావులపాడు వద్ద పోలీసులు గుర్తించిన మృతదేహం

అవినీతి కేసులో పోర్టు అధికారికి జైలు శిక్ష, జరిమానా

కాకినాడ క్రైం/రాజమహేంద్రవరం సిటీ జనవరి 20(ఆంధ్రజ్యోతి): అవినీతి కేసులో గతంలో పోర్టు ఆఫీసర్‌గా పనిచేసిన మనం వెంకట కృష్ణమోహన్‌కు రాజమహేంద్రవరం ఏసీబీ కోర్టు రెండేళ్ల జైలు శిక్షవిధిస్తూ తీర్పునిచ్చింది. ఈ మేరకు అవినీతి నిరోధక శాఖ ఇన్‌స్పెక్టర్ ఐ.సతీష్ ఒక ప్రకటన విడుదల చేశారు. కాకినాడ సాంబమూర్తినగర్‌కు చెందిన షేక్ అహ్మద్ అలీషాకు కాకినాడ పోర్టు ఏరియాలో స్థలాన్ని కేటాయించి బార్జి మరమ్మతుల కోసం అనుమతిని జారీ చేసేందుకు మనం వెంకట కృష్ణమోహన్ 2009 జూన్ 15న రూ.2 లక్షలు లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించడంతో అధికారులు ట్రాప్ చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ కేసులో కృష్ణమోహన్ నేరం చేసినట్టు రుజువు కావడంతో రాజమహేంద్రవరం ఏసీబీ కోర్టు న్యాయమూర్తి పీవీఎస్ సూర్యనారాయణమూర్తి అవినీతి నిరోధక చట్టం 1988 సెక్షన్ 7 ప్రకారం ఏడాది కఠిన కారాగార శిక్ష, రూ.5వేలు జరిమాన, యూ/ఎస్ 13(1)(డి) అవినీతి నిరోధక చట్టం ప్రకారం 2 ఏళ్ల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ రెండు శిక్షలు ఏకకాలంలో అమలు చేయబడతాయని తెలిపారు. ఈ కేసులో పీపీ ఎంవీ దుర్గాప్రసాద్ వాదనలు వినిపించారు. కేసును ప్రస్తుత డీఎస్పీ దర్యాప్తు చేశారు. ఇన్‌చార్జి అడిషనల్ ఎస్పీ(ఏసీబీ) వి.సుబ్బరాజు, డీఎస్పీ ఎం.కిషోర్‌కుమార్ పర్యవేక్షించారు.

యువతి మృతికి కారణమైన వ్యక్తికి ఐదేళ్ల జైలు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): యువతి మృతికి కారకుడైన వ్యక్తికి న్యాయమూర్తి ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ రాజమహేంద్రవరం పదో అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ ఎస్సీఎస్టీ కోర్టు న్యాయమూర్తి ఆర్.శ్రీలత తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళితే 2015లో గోకవరం గ్రామానికి చెందిన యువతి స్వాతిని పిల్లి ఆనంద్‌బాబు ప్రేమిస్తున్నానని వెంటబడి శారీరకంగా ఇబ్బంది పెట్టేవాడు. దీంతో ఆమె ఆత్మహత్య చేసుకుని చనిపోయింది. దీంతో ఆనంద్‌బాబుపై పలు సెక్షన్ల కింద ఎస్ఐ ఆర్.శివాజీ కేసు నమోదు చేయగా నార్త్ జోన్ డీఎస్పీ ప్రసన్నకుమార్ దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్టు చేశారు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో ఐదేళ్ల జైలు శిక్ష, రూ.10 వేలు, రూ.6 వేలు, రూ.6 వేలు చొప్పున జరిమాన విధించారు. ఈ కేసులో ఇతర నిందితులైన ఏ2, ఏ3లపై అభియోగాలను కోర్టు కొట్టివేసింది. ఈ కేసులో స్పెషల్ ఏపీపీలు ఐ.వెంకటరత్నం, కె.రాధాకృష్ణరాజు వాదనలు వినిపించారు.

పండక్కి వచ్చి తిరిగెళ్తూ అనంతలోకాలకు..

» గురజాడలో డివైడర్‌ను ఢీకొన్న బైక్

» తీవ్రగాయాలతో ఇద్దరు యువకులు మృతి

» మృతులది కాకినాడ జిల్లా



ఘటనా స్థలంలో నాగవీరభద్ర దుర్గ మృతదేహం

పమిడిముక్కల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగకు ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులతో సరదాగా గడిపి తిరిగి హైదరాబాద్ వెళ్తున్న ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో మరణించిన ఘటన విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున జరిగింది. పమిడిముక్కల పోలీసుల కథనం ప్రకారం... కాకినాడ జిల్లా కిర్లంపూడికి చెందిన ముక్తా నాగవీరభద్ర దుర్గ(20), పిఠాపురానికి చెందిన దాసరి నిమ్మి చంద్ర(21) హైదరాబాద్‌లో ఉంటూ సంక్రాంతికి స్వస్థలానికి వచ్చారు. పండగ సెలవులు ముగియడంతో ఆదివారం రాత్రి మోటార్ సైకిల్‌పై హైదరాబాద్ బయలుదేరారు. అయితే వారు ప్రయాణిస్తున్న బైక్ పమిడి ముక్కల మండలం గురజాడ సమీపంలో హైవేపై ఫ్లైఓవర్ డివైడర్‌ను ఢీకొంది. తీవ్రంగా గాయపడిన నాగ వీరభద్ర దుర్గ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలైన చంద్ర విజయవాడ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ కన్నుమూశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

పంటబోదెలో ద్విచక్రవాహనం పడి వ్యక్తి మృతి

ద్రాక్షారామ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం వేగాయమ్మపేట వద్ద సోమవారం ఉదయం ద్విచక్రవాహనం అదుపు తప్పి పంటబోదెలో పడిపోవడంతో వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెలంపాలెం గ్రామానికి చెం దిన కోటిపల్లి జ్యోతిబాబు(38)వెల్డింగు పనిచేస్తుంటాడు. సోమవారం ఉదయం పనికి వెళ్లాడు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో జ్యోతిబాబు వాహనంతోపాటు బోదెలో పడిపోయినట్లుగా అతడి భార్యకు ఫోన్‌ద్వారా సమచారం అందింది. బంధువులతో కలసి వెళ్లి 108 అంబులెన్స్‌లో ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీలో భద్రపరిచారు. ద్రాక్షారామ ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేటకు వెళ్లిన మత్స్యకారుడు..

కాకినాడ క్రైం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో వేటకు వెళ్లిన ఓ మత్స్యకారుడు మృతి చెందిన సంఘటన కాకినాడలో జరిగింది. స్థానిక దుమ్ములపేటకు చెందిన దోని గంగరాజు (46) చేపల వేట చేస్తూ కుటుంబాన్ని పోషిస్తూంటాడు. ఈనెల 18న స్థానిక కుంభాభిషేకం రేవు నుంచి నాటు పడవపై వేటకు వెళ్లాడు. రాత్రి అయినా వేట నుంచి ఇంటికి రాకపోయే సరికి అతడి భార్య సింహాద్రి బంధువులతో కలసి తీరప్రాంతంలో గాలింపు చేపట్టింది. ఆచూకీ కానరాలేదు. దీంతో పోర్టు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అయితే ఆదివారం సాయంత్రం సముద్రంలో గంగరాజు విగతజీవిగా తేలియాడాడు. అనంతరం మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. పోర్టు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

మడ అడవులను సందర్శించిన ఎఫ్ఆర్‌వో శిక్షకులు

తాళ్లరేవు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు చెందిన ఫారెస్ట్ ఎఫ్ఆర్‌వో శిక్షకులు 34మంది కోరింగ అభయారణ్యంలో మడఅడవులను సోమవారం సందర్శించారు. ఫారెస్ట్ రేంజర్ ఎస్.వరప్రసాద్ ఆధ్వర్యంలో శిక్షకులకు మడఅడవుల విశిష్టత, వన్యప్రాణుల ప్రాధాన్యత, అడవులో సంచరించే జీవజాతుల వివరాలు తెలియజేశారు. డిప్యూటీ డీఎఫ్‌వో విషాహం, ఎఫ్ఎస్‌వో కె.సిద్దార్థ, ఎఫ్‌బీవోలు మహేష్, గోపి నాగేంద్ర, మధు, సంధ్యారాణి,ధనలక్ష్మి ఉన్నారు.



జ్ఞాపికలు అందజేస్తున్న దృశ్యం

ఏడీబీ రహదారిలో భారీ అగ్ని ప్రమాదం

సుమారు 40 అడుగుల పైబడి మంటలు



ఎగసిపడుతున్న మంటలు

పెద్దాపురం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం ఏడీబీ రహదారిలో స్థానిక వాలుతిమ్మాపురం జంక్షన్ సమీపంలో సోమవారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో టన్నుల కొద్దీ ప్లాస్టిక్ సామగ్రి దగ్ధమైంది. సమీపంలో ఉన్న ఓ పరిశ్రమ ఎటువంటి అనుమతులు లేకుండా ప్లాస్టిక్ సామగ్రిని ప్రమాదం జరిగిన ప్రదేశంలో డంపింగ్ చేసింది. కాల్చిపారవేసిన సిగరెట్ కారణంగా వ్యర్థాలకు నిప్పు అంటుకుని మంటలు ఎగసిపడినట్టు తెలుస్తోంది. సుమారు 40 అడుగుల పైబడి మంటలు ఎగసిపడ్డాయి. భారీగా పొగ కమ్మేయడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. సమీపంలోనే పెట్రోలు బంకు ఉండడంతో మరింత ఆందోళన కలిగించింది. సమాచారం అందుకున్న పెద్దాపురం అగ్నిమాపకసిబ్బంది అక్కడకు చేరుకున్నారు. ప్రమాద తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పెద్దాపురంతో పాటు జగ్గంపేట, ప్రత్తిపాడు, కాకినాడ నుంచి అగ్నిమాపక శకటాలు చేరుకుని మంటలు అదుపు చేసేందుకు అగ్నిమాపక సిబ్బంది శ్రమించారు. ఈ ప్రమాదంలో రూ.లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్టు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఈ అగ్ని ప్రమాదం ప్రమాదవశాత్తూ జరిగిందా లేక ఆర్థిక ప్రయోజనాలు ఆశించి ప్లాస్టిక్ సామాగ్రికి నిప్పు పెట్టారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. అగ్నిమమాపక సిబ్బంది ఎంత మేరకు నష్టం వాటిల్లిందో అంచనా వేస్తున్నారు.

ఎంసీపీసీతో కేసుల సత్వర పరిష్కారం

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి సునీత

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వం, రాజీ ప్రాజెక్ట్ కమిటీ (ఎంసీపీసీ) ఆధ్వర్యంలో కేసుల సత్వర పరిష్కారం అయ్యే అవకాశం ఉందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. జిల్లా కోర్టు డీఎల్ఎస్ఏ మందిరంలో సోమవారం సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మధ్యవర్తిత్వం, రాజీ ప్రాజెక్ట్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని జ్యుడీషియల్ అధికారులకు, న్యాయవాదులకు మధ్యవర్తిత్వ కాన్సెప్ట్ అండ్ టెక్నిక్‌లపై శిక్షణ నిర్వహించారు. న్యాయమూర్తి సునీత మాట్లాడుతూ సోమవారం నుంచి ఈనెల 24వ తేదీ వరకు శిక్షణ నిర్వహిస్తున్నామన్నారు. ఎంసీపీసీ యాక్ట్ ప్రకారం 2023 ప్రొవిజన్ ప్రకారం జ్యుడిషియల్ అధికారులు, న్యాయవాదులకు శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. హైకోర్టు సూచనల మేరకు జ్యుడిషియల్ అధికారులు, న్యాయవాదులను నామినేట్ చేసి కేసులను పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుతుందన్నారు. శిక్షణలో పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ ఏ.గాయిత్రిదేవి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాష్ బాబు, సీనియర్ శిక్షకులు సురీందర్ సింగ్(ఢిల్లీ),ఎస్.అరుణాచలం (తమిళనాడు),అధికారులు, న్యాయవాదులు ఉన్నారు.

తిరుపతిలో తొక్కిసలాట ఘటనపై మాజీ ఎంపీ హర్షకుమార్ ఫిర్యాదు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో తొక్కిసలాట ఘటనకు సంబంధించి టీటీడీ పాలక మండలి, ఈవో, జేఏవోలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ రాజమహేంద్రవరం త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం స్టేషన్‌కు వెళ్లిన ఆయన తన ఫిర్యాదును పోలీసులకు అందించి రసీదు పొందారు. తొక్కిసలాటలో ఆరుగురు మరణానికి కారకులుగా టీటీడీ చైర్మన్, ఈవో, జేఈవోపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఫిర్యాదులో కోరారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం



కాకినాడలో ధర్నా చౌక్‌వద్ద ధర్నా చేస్తున్న సహకార సంఘం ఉద్యోగులు

సహకార సంఘం ఉద్యోగుల ఆందోళన

● డిమాండ్లు పరిష్కరించాలని ధర్నా

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 20(ఆంధ్ర జ్యోతి): ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంవద్ద ఉద్యోగులు ఆందోళన నిర్వహించారు. జీవో నెంబరు 36 ప్రకారం పేస్కేల్ అందరికీ అమలు చేయాలని, 2019 తర్వాత చేరిన ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆదినారాయణ మాట్లాడుతూ జీవోనెంబరు 36 ప్రకారం వయోపరిమితి 62ఏళ్లు పెంచాలన్నారు. 2019, తర్వాత నియమించిన ఉద్యోగులను కొనసాగించాలన్నారు. డిమాండ్లపై రాష్ట్రవ్యాప్తం గా దశలవారీగా ఆందోళన చేపట్టామన్నారు. తదుపరి ఫిబ్రవరి 27న రాష్ట్ర అప్కాబ్ కార్యాలయం వద్ద ధర్నాకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు, పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి సత్తిరాజు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమళ్ల పద్మ, నగర కోకన్వీనర్ పలివెల వీరబాబు, జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యులు వెంకటరమణ పాల్గొన్నారు.

రహదారుల భద్రతా నియమాలు పాటించాలి

● కాకినాడ ఆర్టీవో శివారెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంవీఐ ప్రసాద్

పెద్దాపురం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రహదారుల భద్రతా నియమాలు ప్రతీఒక్కరూ పాటించాలని కాకినాడ ఆర్టీవో శివారెడ్డి అన్నారు. స్థానిక వాలు తిమ్మాపురంలో ఉన్న పట్టాభి ఆగ్రో ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ (సైరస్ ఓవర్‌సీస్) పరిశ్రమలో పెద్దాపురం ఎంవీఐ ప్రసాద్ ఆధ్వ ర్యంలో నిర్వహించిన రహదారి భద్రతా మాసోత్సవాల కార్యక్రమంలో ఆయన పాల్గొని సోమవారం మాట్లాడారు. ప్రతీఒక్కరూ హెల్మెట్ ధరించాలని, సీట్ బెల్టు పెట్టుకోవాలన్నారు. ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలను పాటించడం ద్వారా ప్రమాదాలను చాలావరకూ తగ్గించుకోవచ్చని సూచిం చారు. డ్రైవర్లకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిం చారు. ఈకార్యక్రమంలో పట్టాభి ఆగ్రో ఫుడ్స్ ఎండీ కృష్ణారావు, ఎంవీఐ కళాజ్యోతి, డాక్టర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జైలు, జరిమానా

కాకినాడ క్రైం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన 27మందికి కాకినాడ 3వ స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ వి.నరసింహారావు జైలు, జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్ సీఐలు ఎస్.రమేష్, డి.రామారావు తమ సిబ్బందితో ఆదివారం రాత్రి డ్రంకన్ డ్రైవ్ నిర్వహిస్తుండగా మోతాదు దాటి మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిని బ్రీత్ ఎనలైజర్లతో పరిక్షించగా 27మంది పట్టుబడ్డారు. వారిని సోమవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి వారిలో ఇద్దరికి మూడురోజులు చొప్పున జైలుశిక్ష, మరో 13మందికి ఒక్కొక్కరికీ రెండురోజుల జైలు విధించారు. మరో 12మందికి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధించినట్లు సీఐ రమేష్ తెలిపారు.

అనుమానాస్పద మెసేజ్‌లకు స్పందించవద్దు

పిఠాపురం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదంగా వచ్చే కాల్స్, మెస్సేజీలకు స్పందించవద్దని పిఠాపురం పట్టణ ఎస్‌ఐ మణికుమార్ సూచించారు. పిఠాపురం పట్టణంలోని చిన్నమాంబపార్కులో సోమవారం రాత్రి ప్రజలకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఇటీవల బ్యాంకు నుంచి కాల్ చేస్తున్నామని మీ ఆధార్ వివరాలు చెప్పాలని, లేకుంటే యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని చెబుతున్నారని అటువంటి వాటిని నమ్మవద్దని సూచించారు.

పాడిపరిశ్రమ అభివృద్ధికి కృషి

● పశుఆరోగ్య శిబిరం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పంతం నానాజీ



కరప: పశుఆరోగ్య శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నానాజీ, పశుసంవర్ధకశాఖ జేడీ సూర్యప్రకాష్

కరప, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పాడిపరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కృషిచేస్తుందని, అన్ని గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. కరప మండలం గొర్రిపూడిలో సోమవారం పశుఆరోగ్య వైద్యశిబిరాన్ని పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ సూర్యప్రకాష్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో నానాజీ మాట్లాడుతూ పశువుల్లో సంక్రమిస్తున్న వ్యాధులపట్ల పాడిరైతులు అవగాహన పెంపొందించుకుని సకాలంలో వైద్య సేవలందించాలన్నారు. జేడీ సూర్యప్రకాష్ మాట్లాడుతూ జిల్లాలో 2.60లక్షల పశువులు ఉన్నాయని, ఈశిబిరాల ద్వారా వాటికి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్యం అందిస్తామన్నారు. కేవలం పెయ్యదూడలు మాత్రమే జన్మించే టెక్నాలజీని అభివృద్ధి చేశామని, వై క్రోమోజోములను ఫిల్టర్ చేసి 90 శాతం ఆడవి పుట్టేలా ఇంజక్షన్‌లు రూపొందించామన్నారు. పాడిరైతులకు 90శాతం సబ్సిడీపై మినీ గోకులాలు, కిసాన్ క్రెడిట్ కార్డులు, గడ్డి విత్తనాలు, గడ్డి కత్తిరించే యంత్రాలు, సంచార పశువైద్యశాలలు వంటివి అందుబాటులోకి తీసుకువచ్చామని తెలుపుతూ వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముందుగా ఎమ్మెల్యే శిబిరాన్ని ప్రారంభించి పలువురికి ఉచితంగా మందులు అందజేశారు. లేగదూడల ప్రదర్శనలో మొదటి మూడుస్థానాలు సాధించిన పాడి రైతులకు, మిగిలిన రైతులకు ప్రోత్సాహక బహుమతులను ఎమ్మెల్యే అందజేశారు. పశువైద్యశిబిరాల పోస్టర్‌ను ఆవిష్కరించి రైతులకు సూచనలు చేశారు. పశుసంవర్ధకశాఖ డీడీ డాక్టర్ అంబేడ్కర్, ఏడీ ఎన్‌జేఎస్ సురేష్‌బాబు, ఎంపీడీవో మట్టపర్తి అనుపమ, పశువైద్యులు డాక్టర్ రవికిరణ్‌బాబు, అనిల్ విల్సన్, సురేష్, కవిత, కార్యదర్శి భద్రరావు, నాయకులు గండి వెంకటేశ్వరరావు, అనుకుల రాంబాబు పాల్గొన్నారు.

రైతులకు పశువుల ఆరోగ్యంపై అవగాహన ఉండాలి: ఏడీ

తాళ్లరేవు: రైతులంతా పశువుల ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని పశుసంవర్ధకశాఖ ఏడీ బ్రహ్మవేద అన్నారు. సోమవారం నీలపల్లి సర్పంచ్ చిట్టూరి నాగమణి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత పశుఆరోగ్య శిబిరంను ఏడీ బ్రహ్మవేద ప్రారంభించారు. వైద్య చికిత్సలు, గర్భకోసవ్యాధులకు చికిత్స, వ్యాధినిరోధక టీకాలు, నట్టల నివారణ మందుల పంపిణీ, పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు, శాస్త్రీయ యాజమాన్యంపై అవగాహన సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉప సర్పంచ్ వస్కా రెడ్డి, ఎంపీటీసీ దంగేటి సూరిబాబు, చిట్టూరి కలికిమూర్తి, డాక్టర్ సుధ, సిబ్బంది శ్రీనివాస్, చంద్రశేకర్, రమ్య, శంఖరమహాల్, రైతులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

గొల్లప్రోలురూరల్: పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు సూచించారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నివాసంలో సోమవారం శిబిరాలకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. చేబ్రోలు పశువైద్యాధికారి డాక్టర్ హిమజ పాల్గొన్నారు.

కొత్తపల్లి: ఈనెల 20 నుంచి 31వరకు రాష్ట్ర ప్రభుత్వం పశుసంవర్ధకశాఖ ద్వారా నిర్వహిస్తున్న ఉచిత పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కొత్తపల్లి, నాగులాపల్లి పశువైద్యశాల వైద్యులు శ్రీమన్నారాయణ, సందీప్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. కొత్తపల్లి, కొత్తమూలపేట గ్రామాల్లో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాల్లో పశుగర్భకోస నివారణ పరీక్షలు, నట్టల నివారణ, వ్యాధి నిరోధక టీకాలను వేశారు. అనంతరం పాడి రైతుల పశువులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

ఆల్ ఇండియా క్రీస్టియన్ కౌన్సిల్ వేడుకలు

సర్పవరం జంక్షన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఆల్ ఇండియన్ క్రీస్టియన్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం సోమవారం రమణయ్యపేట శివారు రాయుడుపాలెంలో సీటీసీ ప్రాంగణంలో ప్రధాన కార్యదర్శి రెవరెండ్ డాక్టర్ స్టీఫెన్ ఆనంద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 2024-25లో ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చించారు. భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాలపై సభ్యులు చర్చించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు జాన్ రిక్కీ గూటం, గౌరవ అధ్యక్షులు బిషప్ బెన్నీ, ఏఐసీసీ రాష్ట్ర, కాకినాడ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులతోపాటూ తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఉరుస్ షరీఫ్ గంధోత్సవం

● ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప

పెద్దాపురం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మతసామరస్యానికి ప్రతీక ఉరుస్ షరీఫ్ గంధోత్సవం అని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. పట్టణ శివారు పాతపెద్దాపురంలో ఉన్న హజరత్ షేక్ మదీనా పాచ్చా ఔలియా దర్గావద్ద ఉరుస్ గంధోత్సవ కార్యక్రమంలో ఆయన సోమవారం పాల్గొన్నారు. వైసీపీ పెద్దాపురం నియోజవర్గ ఇన్‌చార్జ్ దవులూరి దొరబాబు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈసందర్భంగా వారికి ముస్లిం మత పెద్దలు, దర్గా నిర్వాహకులు మహ్మద్ లాయక్ ఆలీ తదితరులు పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. అలాగే వారితో కలిసి ప్రత్యేక ప్రార్థనలు, నమాజ్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన మిమిక్రీ, మ్యాజిక్‌షో పలువురుని అలరించాయి. ఖురాన్ ఖానీ, ఖవ్వాలీ, ఫాతేహా ఖానీ కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో తూతిక రాజు, కొరిపూరి రాజు, పొలమరశెట్టి సత్తిబాబు, ఆరీఫ్ ఆలీ, ఇర్షాద్ ఆలీ, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



దర్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప



డీజీపీ తిరుమలరావును సత్కరించిన ఎమ్మెల్యేలు కొండబాబు, నానాజీ



రాష్ట్ర డీజీపీని కలిసిన కొండబాబు, నానాజీ

కాకినాడ సిటీ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరానికి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావును కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ మర్యాదపూర్వకంగా కలిశారు. పోలీస్ గెస్ట్‌హౌస్‌లో సోమవారం డీజీపీని ఎమ్మెల్యేలు కలిసి శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. డీఐజీ అశోక్‌కుమార్‌ను కొండబాబు, నానాజీ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంపులు

గొల్లప్రోలురూరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలంలోని గ్రామాల్లో ఈనెల 21వ తేదీ నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కర్రి స్వప్న తెలిపారు. 21, 22వ తేదీల్లో తాటిపర్తి, 23, 24న చెందుర్తి, 27, 28న దుర్గాడ, 29,30న చేబ్రోలు గ్రామాల్లో ఈ క్యాంపులు జరుగుతాయని చెప్పారు. ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు ఆధార్ నమోదు, నమోదు పూర్తయి కార్డు రాని వారు, ఐదు సంవత్సరాలు దాటిన పిల్లలకు బయోమెట్రిక్ అప్డేట్, ఇంటి చిరునామా మార్పు, 2010నుంచి 2016 మధ్యన ఆధార్ తీసుకుని ఆధార్ అప్డేట్ చేయించుకోని వారు, ఇతర ఆధార్ సంబంధిత సేవలకు ఆయా గ్రామాల్లో జరిగే ఆధార్ ప్రత్యేక శిబిరాలకు వెళ్లాలని ఆమె వివరించారు. మండలంలోని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె సూచించారు.

థియేటర్లలో మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలి

కాకినాడ సిటీ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): నగరంలోని థియేటర్లలో మౌళిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీటీసీ పితాని రాము కోరారు. దీనిపై సోమవారం కాకినాడ ఆర్డీవో కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. థియేటర్లలో కనీస వసతులు కల్పించకుండా మెయింటె నెన్స్ ఛార్జీలువసూలు చేస్తున్నారని వివరించారు. టాయిలెట్లలో అపరిశుభ్ర వాతావరణం నెలకొందన్నారు. వీటిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

వైద్యం అనంతరం ఆసరా సాయం సత్వరం అందించాలి



తోకల ప్రసాద్

కాకినాడ సిటీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పేదలకు వైద్యచికిత్స అనంతరం ప్రభుత్వం ఆసరా సాయం సత్వరం అందించాలని ఏఐటీ యూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ కోరారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సామాన్యులకు 3250 రకాల రోగాలకు ఆరోగ్యశ్రీ పథకం వర్తించేలా వైద్యచికిత్సలు అందిస్తోందన్నారు. వీటిలో క్రిటికల్ కేసులకు ఆసరాగా వైద్య చికిత్స తర్వాత 15 నుంచి 20 రోజులపాటు ఇంటికి పరి మితమైన వారికి జీవన భృతి కల్పిస్తోందన్నారు.

కాలిపోయినచోటే పక్కా ఇళ్లు కట్టించాలని ధర్నా

కాకినాడ సిటీ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కాకినాడ 12వ డివిజన్ ఏఎంజీ స్కూల్ ఎదురుగా కాలిపోయిన చోటే పక్కా ఇళ్లు కట్టించాలని బాధితులు డిమాండ్ చేశారు. కాలిపోయిన ఇళ్ల ప్రదేశం వద్ద సోమవారం బాధితులు ధర్నా చేశారు. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ తమకు న్యాయం చేయాలంటూ జనసేన పార్టీ జెండాలు పట్టుకుని నిరసన తెలిపారు. న్యాయం జరిగే వరకు నిరసన కొనసాగిస్తామని ప్రకటించారు.

ఏపీని పాతాళంలోకి తొక్కేసిన వైసీపీ: ఎమ్మెల్యే నానాజీ



గొర్రిపూడిలో సీసీరోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నానాజీ

కరప, జనవరి 20(ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్రప్రదేశ్‌ను వైసీపీ తన ఐదేళ్ల పాలనలో పాతాళంలోకి తొక్కేసిందని, ప్రజలు సంయమనం పాటించి సహకరిస్తే కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని పైకి తీసుకురాగలదని ఎమ్మెల్యే పంతం నానాజీ స్పష్టం చేశారు. కరప మండలం గొర్రిపూడిలో సోమవారం ఆయన పర్యటించి రూ.40లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. పలువురు గ్రామస్తులు తమ సమస్యలను ఏకరువు పెట్టగా ఆయన సైవిధంగా స్పందించారు. మంచి విజన్ ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు కేంద్ర సహకారంతో వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి ఒక దిశదశ చూపారని కొనియాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలకు కట్టుబబడి ఉన్నానని స్పష్టం చేశారు. వచ్చే మార్చి నెలాఖరుకు తాగునీటిని అందించేందుకు కరప మండలంలో రూ.5.43కోట్లతో కొత్త పైపులైన్ల ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ఎన్నికల హామీలో భాగంగా రోడ్ల నిర్మాణానికి రూ.23కోట్లు, కనెక్టివిటీ రోడ్లకు రూ.10 కోట్లను మంజూరు చేస్తున్నామన్నారు. డిప్యూటీ సీఎం పవన్ చొరవతో కాకినాడ బీచ్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడానికి కృషిచేస్తున్నామన్నారు. ఐపీఎల్ లాంటి క్రికెట్ మ్యాచ్‌లకు కాకినాడలో ఒక స్టేడియం నిర్మాణానికి ప్రభుత్వం నుంచి పరిపాలనాపరమైన అనుమతులు లభించాయని, స్థల సమీకరణ పూర్తయిన వెంటనే పనులు మొదలుపెడతామని స్పష్టం చేశారు. అనంతరం పెనుగుదురులో ప్రమాదకరంగా ఉన్న ఆర్‌అండ్‌బీ కల్వర్ట్‌ను ఎమ్మెల్యే నానాజీ పరిశీలించి అధికారులకు తగు సూచనలు జారీ చేశారు. ఎంపీటీసీలు యనమదల వెంకటలక్ష్మి, పుణ్యమంతుల సింహాద్రమ్మ, కూటమి నాయకులు గండి వెంకటేశ్వరరావు, బండారు మురళి, అనుకుల రాంబాబు, పుణ్యమంతుల అన్నవరం, ఓలేటి సూర్యనారాయణ, యనమదల దొరబాబు, పుణ్యమంతుల గంగరాజు, దూడల నారాయుడు, పబ్బినీడి ప్రసాద్, వెలగా వీరభద్రరావు, ముద్రగడ రమేష్, జల్దాని ఓంనమశ్శివాయ పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు జెడ్పీ సీఈవో వీవీఎస్ లక్ష్మణరావు తెలిపారు. కరప, వేళంగి గ్రామాల్లోని సీపీడబ్ల్యూ స్కీమ్‌లను సోమవారం ఆయన పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు జారీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే వేసవి నాటికి తాగునీటి సరఫరాలో సమస్యలు ఉత్పన్నం కాకుండా ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నామన్నారు. జిల్లా పరిధిలో 64 సీపీడబ్ల్యూ స్కీమ్‌లు ఉన్నాయని వారానికి రెండు చొప్పున పరిశీలించి అక్కడి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పైపులైన్ లీకేజీని అరికట్టేలా మరమ్మత్తులు , అవసరమైన చోట కొత్త పైపులైన్లను ఏర్పాటుచేయిస్తున్నామన్నారు. ఎంపీడీవో మట్టపర్తి అనుపమ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వి.వర్ధన్, ఏవో బీఎల్ నరసింహం, సుబ్రహ్మణ్యం, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి: కమిషనర్



ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో సమస్యలు వింటున్న కమిషనర్ భావన

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు వచ్చే సమస్యల అర్జీల పరిష్కారానికి సత్వరం చొరవ చూపాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 9.30నుంచి 10.30 గంటల వరకు నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమానికి సుమారు 15మంది ఫోన్‌చేసి తమ సమస్యలు విన్నవించుకున్నారు. అనంతరం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో వివిధ సమస్యలపై 25కి పైగా అర్జీలు కమిషనర్ భావన స్వీకరించారు. అదనపు కమిషనర్ కెటి సుధాకర్, డిప్యూటీ కమిషనర్ కె.మనోహర్, ఎంహెచ్‌ఓ డాక్టర్ పృధ్వీచరణ్, కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, మేనేజర్ సత్యనారాయణ, టీపీఆర్వో శైలజ పాల్గొన్నారు.

సకాలంలో చెత్త సేకరణ పూర్తి చేయాలి

పారిశుధ్య నిర్వహణ విషయంలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని సకాలంలో చెత్త సేకరణ పూర్తిచేయాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన సూచించారు. సోమవారం తెల్లవారుజామున కమిషనర్ భావన నగరంలో రామారావుపేట మూడులైట్ల జంక్షన్, భానుగుడి జంక్షన్, చార్మినార్ టీ సెంటర్ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. ఇంటింటా చెత్త సేకరణ జరుగుతున్న తీరు గమనించారు. చెత్త సేకరణ వాహనాల రాకపోకల సమయాలను పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంహెచ్‌వో డాక్టర్ పృధ్వీచరణ్, శానిటరీ సూపర్ వైజర్, ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.

ఎలక్ట్రికల్ 'డే'ని విజయవంతం చేయాలి

పెద్దాపురం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 27న నిర్వహించ నున్న ఎలక్ట్రికల్ 'డే'ని విజయవంతం చేయాలని ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు చింతల సత్యనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక వరహాలయ్యపేటలో ఉన్న యాసలపు సూర్యారావు భవనంలో ఎలక్ట్రికల్ వర్కర్ల యూనియన్‌లతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

ప్రభుత్వ కళాశాల వద్ద పోలీసు పహారా

పిఠాపురం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలోని ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలవద్ద పోలీసు పహారా ఏర్పాటు చేశారు. పట్టణంలోని ప్రభుత్వ, ప్రవేటు జూనియర్ కళాశాలలవద్ద ఈవ్‌టీజింగ్ పెరిగిపోయిందని, కళాశాల ప్రిన్సిపాల్ ఈ విషయంపై ఫిర్యాదు చేసినా పోలీసులు ఉదాశీనంగా వ్యవహరిస్తున్నారంటూ పదిరోజుల క్రితం పిఠాపురంలో పర్యటించిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈవ్‌టీజింగ్‌కు పాల్పడే వారిని తొక్కి నారతీస్తానని ప్రకటించడంతో ఇకపై పిఠాపురంలో ఆ మాట వినబడకూడదని స్పష్టం చేశారు. పోలీసులు ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఒక ఏఎస్‌ఐ, ఒక కానిస్టేబుల్‌ను నియమించారు

ఉపాధి హామీపై 22 నుంచి సోషల్ ఆడిట్

పిఠాపురం రూరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన పనులపై ఈనెల 22 నుంచి సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు సోషల్ ఆడిట్ ఎస్‌ఆర్‌పీ సింహాద్రి తెలిపారు. పిఠాపురం మండలపరిషత్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బందితో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని 24 గ్రామాల్లో ఫిబ్రవరి 7వ తేదీ వరకూ తనిఖీలు నిర్ధేశించిన సమయాల్లో జరుగుతాయన్నారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఏఈ నూకరాజు, ఏపీవో ఏబీబీ నాయుడు పాల్గొన్నారు.

అనఘా దత్తక్షేత్రంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం

పిఠాపురం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని అగ్రహారంలో ఉన్న శ్రీపాదవల్లభ అనఘా దత్తక్షేత్రంలో త్రయోవింశతి(23వ) వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. అనఘాదేవి సమేత దత్తాత్రేయస్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. గణపతిపూజ, కలశస్థాపన, మండపారాధన, త్రిరాత్రి దీక్ష రుద్రయాగం జరిగాయి. సాయంత్రం యజుర్వేద పారాయణ, ప్రదోషకాల పూజ, చతుర్వేద స్వస్తి నిర్వహించారు.

రెడ్ కాన్వెంట్ ట్రస్ట్‌కు అభినందన పత్రం అందజేత

కాకినాడరూరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): జిల్లా అటవీ శాఖాధికారి కార్యాలయంలో డీఎఫ్‌వో రవీంద్రనాథ్‌రెడ్డి, రెడ్ కాన్వెంట్ ట్రస్ట్ ద్వారా కోరింగ మడ అడవుల్లో అభివృద్ధి పనులు చేపట్టినందుకుగానూ ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ బాదం బాలకృష్ణకు అభినందన పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా డీఎఫ్‌వో మాట్లాడుతూ భారతదేశంలో అతిపెద్దదైన కోరింగ అడవి పెరగడానికి అవసరమయ్యే ఉప్పునీరు వెళ్లే కెనాల్స్, సబ్‌ఛానెల్స్‌లలో పూడికతీసి నీరు వెళ్లేటుట్లు చేశారన్నారు. అనంతరం బాలకృష్ణ మాట్లాడుతూ రెడ్ కాన్వెంట్ పూర్వవిద్యార్థి అయిన మాజీ శాప్ ఎండీ ఎస్.బంగారాజు సలహా మేరకు ఈకార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ కోశాధికారి జగన్నాధరావు, పద్మనాభం, రమణమూర్తి పాల్గొన్నారు.

ఆకాశమంత అభిమానం..తాకితే ప్రమాదం...!



గొర్రిపూడిలో విద్యుత్ వైర్లను తాకుతున్న ఐరన్ ఫ్రేమ్ ఫ్లెక్స్

కరప, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కరపమండలం గొర్రిపూడి గ్రామంలో కరెంట్ వైర్లను తాకుతూ ఏర్పాటుచేసిన ఐరన్ ఫ్రేమ్ ఫ్లెక్స్ ఇది. స్థానిక ఎమ్మెల్యే పంతం నానాజీ రాకను పురస్కరించుకుని గ్రామంలోని జనసేన నాయకుడు ఈ ఫ్లెక్స్‌ను ఏర్పాటుచేశారు. రోడ్డుపక్కనే విద్యుత్ వైర్లను తాకేలా ఏర్పాటు చేసిన ఈ ఫ్లెక్స్‌ను చూసి పలువురు భయభ్రాంతులకు గురవుతున్నారు. అటుగా వెళ్లే కుర్రకారు, చిన్న పిల్లలు ఆ ఫ్లెక్స్‌ను పట్టుకుంటే జరిగే ఉపద్రవాన్ని ఊహించడానికి కూడా భయమేస్తుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. అభిమానం హద్దుమీరినా పర్లేదు గానీ, అవాంఛనీయ ఘటనలు జరక్కుండా చూసుకోవాల్సిన బాధ్యత నాయకులకు లేదా అని ప్రశ్నిస్తున్నారు. విద్యుత్ వైర్లను తాకుతూ ప్రమాదకరంగా కనిపిస్తున్న ఆ ఫ్లెక్స్‌ను తక్షణం తొలగించాలని పలువురు కోరుతున్నారు.

కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి : ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల నేతృత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి పాలన సాగుతుందని, అన్ని రంగాలలో అభివృద్ధి కూటమి ప్రభుత్వంలోనే సాధ్యపడుతుందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. సామర్లకోట మున్సిపాల్టీ ఆధ్వర్యంలో పలువార్డులలో సుమారు రూ.80లక్షల టీపీఎస్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనుల కు ఎమ్మెల్యే చినరాజప్ప, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామితో కలిసి సోమవారం పనులు ప్రారంభించారు. మున్సిపల్ కమీషనర్ శ్రీవిద్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చినరాజప్ప, కుడా చైర్మన్ తుమ్మల బాబు హాజరయ్యారు.ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ తాను గతంలో హోం మంత్రిగా, ఉపముఖ్యమంత్రిగా కోట్లాది రూపాయల మేర నిధులు వెచ్చించి అభివృద్ధి చేసానని మరిన్ని నిధులతో అభివృద్ధిచేసేందుకు ప్రణాళికలు రూపొందించినా మొన్నటివరకూ అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం, అందులో సూపర్ ఎమ్మెల్యేగా వ్యవహరించిన వైసీపీ నాయకుడు నియోజకవర్గాన్ని నిరోమయం చేశారని ఆరోపించారు. అనంతరం కుడా చైర్మన్ తుమ్మల బాబు మాట్లాడుతూ ఇప్పటికే ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ప్రత్యేక కృషితో గ్రామీణప్రాంతాలు సీసీ రోడ్లతో సంక్రాంతి పండుగలను ప్రజలు ఎంతో ఆనందంగా జరుపుకున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జీ. అరుణ, తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో మరిన్ని సేవలు

సమాజంలో పలువురు దాతల సహకారంతో సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మరిన్ని సేవలందించేందుకు దాతలు ముందుకు రావాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రికి రోగుల సౌకర్యార్థం కౌన్సిలర్ పిల్లాడి సత్యవతి ఆధ్వర్యంలో దాతలు వేగి అప్పాజీ, కొడతల శివాజీల సౌజన్యంతో రూ.35వేల విలువ గల ఎయిర్ కండీషనర్‌ను ఆసుపత్రికి సోమవారం ఎమ్మెల్యే చినరాజప్ప అందజేశారు.

'ఆదిత్య'లో వచ్చే నెల 3న సామూహిక అక్షరాభ్యాసాలు

గండేపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీలోని జ్ఞాన సరస్వతి నిలయంలో ఫిబ్రవరి 3న వసంత పంచమి సందర్భంగా ప్రత్యేక పూజలు, సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహిస్తామని ప్రో చాన్సలర్ డాక్టర్ ఎన్.సతీష్ రెడ్డి తెలిపారు. సరస్వతీదేవి పుట్టినరోజునాడు గణపతి పూజ, విశేష అభిషేకాలు, అర్చనలు జరుపుతామన్నారు. మరిన్ని వివరాలకు క్యాంపస్ ఇన్‌చార్జి పి.చక్రవర్తిని 7731886664 నెంబరులో సంప్రదించాలన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక


అర్జీదారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ

ఐటీడీఏ గ్రీవెన్స్‌కు 65 అర్జీలు

రంపచోడవరం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సబ్ కలెక్టర్ కేఆర్ కల్పశ్రీ, ఐటీడీఏ ఏపీవో(జీ) డీఎన్వీ రమణ ప్రజల నుంచి సుమారు 65 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ సీసీ రోడ్లు నిర్మించాలని, కొందు గిరిజనులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ మంజూరు చేయాలని కోరుతూ అర్జీలు అందాయన్నారు. డిప్యూటీ డైరెక్టర్ ఎ.విజయ శాంతి, డీఈవో వై.మల్లేశ్వరరావు, ఏడీఎం హెచ్‌వో జి.శిరీష, ఈఈలు శ్రీనివాసరావు, సుబ్బయ్య, రవికుమార్, డీఎల్‌డీవో కోటేశ్వరరావు, తహసీల్దారు పి.రామకృష్ణ, ఎంపీడీవో ఎస్.శ్రీనివాసుదొర, సీడీపీవో సంధ్యారాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గిరిజనులు సేకరిస్తున్న అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం డివిజన్ కార్యదర్శి పల్లాల లచ్చిరెడ్డి కోరారు. సోమవారం ఆయన ఐటీడీఏ గ్రీవెన్స్‌లో సబ్ కలెక్టర్ కల్పశ్రీని కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం గిట్టుబాటు ధరలు నిర్ణయించి కొనుగోలు చేయకపోవడంతో ప్రైవేట్ వ్యాపారస్తులు నామమాత్రపు రేట్లతో ఆదివాసీల ఉత్పత్తులను మైదాన ప్రాంతాలకు తరలించుకుపోతున్నారన్నారు.

ముంపు బాధితుల పునరావాస సమస్యలపై వినతి


సబ్ కలెక్టర్ కల్పశ్రీకి వినతిపత్రం అందజేస్తున్న దేవీపట్నం సర్పంచ్ రాజామణి

దేవీపట్నం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టులో ముంపునకు గురైన దేవీపట్నం మండల బాధితులు పునరావాసం, పునరుపాధి కల్పన, మౌలిక వనరుల, సహాయ సహకారాల కోసం సోమవారం దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి కలిసి సబ్ కలెక్టర్ కల్పశ్రీకి వినతిపత్రం అందజేశారు. ఆర్అండ్ ఆర్ యూనిట్, పీఐపీ కార్యాలయంలో పరిశీలనలో వున్న 1,200 మంది నిర్వాసితుల అర్జీలను మానవతాదృక్పథంతో పరిశీలించి అర్హులుగా గుర్తించాలన్నారు. దేవీపట్నం నిర్వాసితులకు గృహాల కోసం గోకవరంలో కేటాయించిన 9 ఎకరాల భూ సమస్యను తక్షణం పరిష్కరించి కాలనీ నిర్మాణం చేయాలన్నారు. వ్యవసాయ భూముల్లో వృక్షాలు, కట్టడాలకు నష్టపరిహారాలు ఇప్పించాలన్నారు. ఆర్అండ్ఆర్ కాలనీల్లో శ్మశానవాటికలు ఏర్పాటు చేయాలని, పారిశుధ్య కార్మికులను నియమించాలని డిమాండ్లను సబ్ కలెక్టర్ ముందుంచారు. దేవీపట్నం, పూడిపల్లి, కొండమొదలు గ్రామాల నిర్వాసితులు పాల్గొన్నారు.

జగన్ దెబ్బపడిన రంపచోడవరం, చింతూరు ఐటీడీఏలను క్రమబద్ధీకరించండి

జిల్లాల విభజన మేరకు అల్లూరి జిల్లా కలెక్టర్‌ను చైర్మన్ చేయాలి

ముఖ్యమంత్రి చంద్రబాబుకు మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి లేఖ

రంపచోడవరం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జగన్ చేపట్టిన జిల్లాల అడ్డగోలు విభజనతో దెబ్బతిన్న రంపచోడవరం, చింతూరు ఐటీడీఏలను క్రమబద్ధీకరించాలని రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు కూటమి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాసిన లేఖను సోమవారం ఆయన మీడియాకు విడుదల చేశారు. అడ్డదిడ్డంగా జిల్లాలను విడగొట్టిన జగన్ వాటి పరిధిలోకి వచ్చే ఐటీడీఏలను క్రమబద్ధీకరించడంలో విఫలమయ్యారన్నారు. ఈ కారణంగా రంపచోడవరం, చింతూరు ఐటీడీఏలకు తూర్పు గోదావరి జిల్లా కలెక్టరే చైర్మన్‌గా ఉన్నారన్నారు. ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లా పరిధిలో ఐటీడీఏలు లేవని, అవి ఉన్న అల్లూరి జిల్లా కలెక్టరును చైర్మన్‌గాను, ఆ జిల్లాలోని వివిధ శాఖల ఉన్నతాధికారులను సభ్యులుగా నియమించే చర్యలను గత ప్రభుత్వం చేపట్టలేదన్నారు. దీంతో మూడేళ్లుగా పాలకవర్గ సమావేశాలను కూడా నిర్వహించలేని దుస్థితికి ఐటీడీఏలను తీసుకువచ్చారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం వాటిని క్రమబద్ధీకరించే చర్యలు చేపట్టాలని శీతంశెట్టి ఆ లేఖలో కోరారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన


కాయగూర విత్తనాలు అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

రంపచోడవరం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మాస్ వెల్ఫేర్ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సులు నిర్వహించినట్టు డైరెక్టర్ సీహెచ్ సుధాకర్, ప్రెసిడెంట్ జి.గద్దెమ్మ తెలిపారు. రంపచోడవరం, వై.రామవరం, గంగవరం, మారేడుమిల్లి మండలాల్లో నిరక్షరాస్యతను నిర్మూలించేందుకు 30 వయోజన విద్యా కేంద్రాల్లో కేవలం అక్షరాస్యత నేర్పడమే కాక పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రతపై ఈ నెల 10 నుంచి 18వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పెరటి తోటల పెంపకానికి అవసరమైన కాయగూరల విత్తనాలు, జామ, సపోట, నారింజ, బత్తాయి, దానిమ్మ పండ్ల మొక్కలు పంపిణీ చేశారు.

వడ్డి కుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వడ్డి కుల సంఘ ప్రముఖులు

వీఆర్ పురం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వడ్డి కుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ స్థానిక కేవీఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో సోమవారం జరిగింది. రానున్న కాలంలో వడ్డిల ఐక్య వేదిక ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తామని సంఘ నాయకులు తెలిపారు. గ్రామాల వారీగా వడ్డి కుల సంఘాలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో కుల సంఘం పెద్దలు రేవు పెద్ద వెంకటేశ్వర్లు, ముత్యాల రామారావు, ముత్యాల మల్లికార్జునరావు, పెట్టా భద్రరావు, ముత్యాల వరప్రసాద్, బొర్ర దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై ఎంపీడీవో సమీక్ష

రాజవొమ్మంగి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గృహాల నిర్మాణంలో పురోగతిపై పంచాయతీల కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ఎంపీపీడీవో యాదగిరేశ్వరరావు సోమవారం సమీక్షించారు. అభివృద్ధి పనులు, తాగునీరు, పరిశుభ్రత అంశాలపై చర్చించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కూడా నిర్వహించారు. మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖ స్టీల్ ప్లాంటుకు నిధుల మంజూరుపై హర్షం

రంపచోడవరం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు పరిరక్షణకు ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలూ కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. విశాఖ ఉక్కు ఉత్తరాంధ్రకే కాక ఆంధ్రకు మణిహారమన్నారు. ఆర్థిక సంక్షోభంలో ఉన్న స్టీల్ ప్లాంటుకు కేంద్ర ప్రభుత్వం రూ.11,440 కోట్లు ప్యాకేజీ ప్రకటించడంపై ఆమె ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

స్వీట్‌కార్న్ సాగు... బాగు

కాసులు కురిపిస్తున్న పంట

ఎకరా తోట రూ.1.10 లక్షలకు కొనుగోలు

రైతుల్లో ఆనందోత్సాహాలు



జగ్గంపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతమైన జగ్గంపేట, ప్రత్తిపాడు, పెద్దాపురం నియోజకవర్గాల్లో విద్యుత్ బోర్ల ఆధారంగా వాణిజ్య పంటలను పండించడంలో సన్నకారు రైతులు ముందున్నారు. ప్రతి సంవత్సరం నల్లరేగడి నేలలో మొక్కజొన్న వేసి స్వీట్‌కార్న్ పండిస్తున్నారు. అయితే ఈ ఏడాది వచ్చే పంటకు మంచి గిరాకీ ఏర్పడిందని రైతులు చెప్తున్నారు. మరీ ముఖ్యంగా ప్రస్తుతం పంట పూర్తిస్థాయిలో లేకపోవడం, వినియోగం ఎక్కువగా ఉండడంతో కాట్రావులపల్లిలో హోల్‌సేల్ అమ్మకాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం 100 మొక్కజొన్న రూ.1,400 చొప్పున కొనుగోలు జరుగుతోందని ఇక్కడి రైతులు చెప్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఎకరా తోటను రూ.లక్ష నుంచి రూ.1.10 లక్షల వరకు వెచ్చించి ఎగుమతులు తీసుకెళ్తున్నారని స్థానిక రైతు ఒకరు చెప్పారు. తమకు ఎకరానికి రూ.30వేలు నుంచి రూ.40వేలు పెట్టుబడి అవుతోందని, సుమారు రూ.60-70 వేలు నికర ఆదాయం వస్తోందని వివరించారు. ఒక పంట నష్టం వచ్చినా రెండో పంటలో లాభాలు తీయడంలో ఈ ప్రాంత సహకార రైతులు ముందున్నారనడానికి దీనిని ఒక ఉదాహరణగా చెప్పుకోవచ్చు. పండగ వెళ్లిన తర్వాత మెట్టలో స్వీట్‌కార్న్ వేసిన రైతులకు కాసుల పంట కురిపిస్తోంది.


రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్

శరవేగంగా రోడ్ల నిర్మాణం

జగ్గంపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు మాసాలు పూర్తి కాకుండానే జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కోట్లాది రూపాయలతో గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు సిమెంటు రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ పేర్కొన్నారు. జగ్గంపేట శ్రీరామ్‌నగర్, టవర్ కాలనీల్లో వేస్తున్న రోడ్లను సోమవారం ఆయన పరిశీలించారు. ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, కొత్త కొండబాబు, దేవరపల్లి మూర్తి, కుంచే రామకృష్ణ, వేములకొండ జోగారావు తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం


పేదలకు అన్నం వడ్డిస్తున్న టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు నవీన్

జగ్గంపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రోడ్డులోని ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద ప్రతి సోమవారం టీడీపీ ఆధ్వర్యంలో టీటీడీ బోర్డు సభ్యుడు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ నేతృత్వంలో అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. ఈ వారం కిర్లంపూడి మండలం ముక్కొల్లుకు చెందిన ఏలేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ బస్వా వీరబాబు సహాయంతో నిర్వహించిన అన్న క్యాంటీన్‌కు టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ హాజరై పేదలకు స్వయంగా అన్న పదార్థాలు వడ్డించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, తోట గాంధీ, రాష్ట్ర ఆర్యవైశ్య అభివృద్ధి సంస్థ డైరెక్టర్ కొత్త కొండబాబు, జీను మణిబాబు, దేవరపల్లి మూర్తి, భూపాలపట్నం ప్రసాద్, దాపర్తి సీతారామయ్య, వేములకొండ జోగారావు, యల్లవెల్లి సీఎం, దేగల సత్తిబాబు, నాగిరెడ్డి అనిల్, బొజ్జప శ్రీను, పుర్రె వీరబాబు, తుమ్మల కిషోర్, ఎండీ కాజా తదితరులు పాల్గొన్నారు.

చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు ప్రారంభం


ఒమ్మంగిలో బ్యాంకు శాఖను ప్రారంభిస్తున్న చైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి

ప్రత్తిపాడు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒమ్మంగిలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు నూతన శాఖను చైర్మన్ కె.ప్రమోద్‌కుమార్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది 276వ శాఖ అని తెలిపారు. డిసెంబరు 2024 నాటికి రూ.11,154 కోట్ల డిపాజిట్లు సేకరించామన్నారు. డిపాజిట్లపై అత్యధిక వడ్డీ ఇస్తున్న ప్రభుత్వరంగ బ్యాంకు అని, 8.6 శాతం సీనియర్ సిటిజన్లు తమ ఖాతాదారులన్నారు. బంగారు ఆభరణాలపై రుణాలు ఇస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో బ్యాంకు ప్రధాన కార్యాలయం ప్రణాళిక అధికారి ఎన్.నరేంద్ర, శాఖాధికారి ఎల్.మనోజ్ విహారి, మాజీ ఎంపీపీ పెద్దింశెట్టి సీతారాం, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు ప్రారంభం

రౌతులపూడి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పశు వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశు వైద్యాధికారి ముద్రగడ వీరరాఘవరావు కోరారు. సోమవారం ఆయన సిబ్బందితో కలిసి ఎస్ఎన్ పట్నంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. గొర్రెలు, మేకలకు నట్టల నివారణ టీకాలు వేశారు. అనారోగ్యానికి గురైన పశువులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. టీడీపీ నేత లాలం అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన శంకర్లపూడిలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. గేదెలు, ఆవులు, చూడు కట్టని, ఎదకు రాని పశువులకు గర్భకోశ వ్యాధులు, చూడు పరీక్షలు చేశారు. సర్పంచ్ ఏపూరి రామారావు, మాజీ ఎంపీటీసీ మిరియాల శ్రీను, పశువైద్యాధికారి సతీష్ పాడి రైతులకు మందులు పంపిణీ చేశారు. బి.శ్రీను, బండి సుబ్బారావు, ముత్యాల వినయ్, గానబాబు, రైతులు పాల్గొన్నారు.

గండేపల్లి (ఆంధ్రజ్యోతి): పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 31వ తేదీ వరకు పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు పశువైద్యాధికారి తెలిపారు. సోమవారం గండేపల్లిలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. 21న మురారి, సూరంపాలెం, 22న ఉప్పలపాడు, 23న ఎన్టీ రాజాపురం, యర్రంపాలెం, 24న మల్లేపల్లి, 25న తాళ్లూరు, యల్లమిల్లి, 27న సింగరంపాలెం, 28న నీలాద్రిరావుపేట, 29న జడ్.రాగంపేటలో శిబిరాలు జరుగుతాయి.

చింతూరు (ఆంధ్రజ్యోతి): రైతులకు మేలు చేసేలా పశుసంవర్ధక శాఖ ఆరోగ్య శిబిరాల నిర్వహణకు శ్రీకారం చుట్టింది. ఈ నెల 31 వరకు ప్రతిరోజు మండలానికి రెండు శిబిరాలు జరిగేలా ప్రణాళిక రచించారు. సోమవారం చింతూరు మండలంలోని కుమ్మూరు, చింతూరు గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటు చేశారు. కుమ్మూరులో సర్పంచ్ ముచ్చిక నాగార్జున శిబిరాన్ని ప్రారంభించారు. వెటర్నరీ డాక్టర్ కె.అన్వేష్ పశువులకు టీకాలు వేశారు. 63 మంది రైతులు పశువులకు, జీవాలకు చికిత్స చేయించారు.

రాజవొమ్మంగి (ఆంధ్రజ్యోతి): మండలం లోని బడదనాంపల్లి పశు ఆరోగ్య శిబిరాన్ని సర్పంచ్ గొల్లపూడి లక్ష్మీదుర్గ సోమవారం ప్రారంభించారు. గడువొకుర్తి, బడదనాంపల్లి పంచాయతీల్లో నిర్వహించిన శిబిరాల్లో 82 కుటుంబాలకు చెందిన రైతులు పాల్గొని పశువులకు వ్యాక్సిన్ వేయించుకున్నారని పశువైద్యాధికారి తరుణ్‌కుమార్ తెలిపారు. గడువొకుర్తిలో శిబిరాన్ని సర్పంచ్ సవిరాల చంద్రుడు ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో ఎల్ఎస్ఏ లక్ష్మణరావు, ఏహెచ్ఏఎస్ చప్పా వీరబాబు, సుబ్బరాజు, రమణ, చిన్నయ్య, వెంకటేష్ కిషోర్, ఎంపీటీసీ చంద్రు లోవకుమారి, ఉప సర్పంచ్ సుబ్రహ్మణ్యం, పీసా చైర్మన్ సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన మత్స్యకార నేతలు

తొండంగి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తీర ప్రాంత మత్స్యకార నేతలు సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో కలెక్టర్ షాన్ మోహన్‌ను కలిశారు. తీర ప్రాంతంలో ఏర్పాటవుతున్న పరిశ్రమల వ్యర్థాల కారణంగా నష్టపోతున్న తమకు తగిన న్యాయం చేయాలని వినతిపత్రం అందజేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో టీడీపీ మత్స్యకార విభాగం జిల్లా నేత కోడ వెంకటరమణ, చొక్కా అప్పారావు, చొక్కా కాశీశ్వరరావు, గంటా లక్ష్మణ్, సూరాడ రాంబాబు, ఒంటిమామిడి సర్పంచ్ అంగులూరి సుధాకర్ వున్నారు.

కుష్ఠు నివారణపై అవగాహన ర్యాలీ

ప్రత్తిపాడు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో సోమవారం కుష్ఠు నివారణపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. రాచపల్లి పీహెచ్‌సీ సిబ్బంది 3వ సచివాలయం నుంచి అల్లూరి సీతారామరాజు సెంటరు వరకు ర్యాలీ కొనసాగించారు. కుష్ఠువ్యాధి పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కల్పించుకోవాలని కోరారు.

ఇద్దరు చోరుల అరెస్టు

ప్రత్తిపాడు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీ కేసుల్లో ఇద్దరిని సోమవారం అరెస్టు చేశారు. ఒమ్మంగి, చినశంకర్లపూడి గ్రామాల్లో చోరీలకు పాల్పడిన ప్రత్తిపాడుకు చెందిన కావిడి మారెమ్మ, కావిడి సుధలను అరెస్టు చేసి రూ.70వేలు నగదు, ఇత్తడి సామగ్రి స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ ఎస్.లక్ష్మీకాంతం తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపర్చగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించారు.


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు సుభాష్

'సర్వేయర్లు, వీఆర్వోలు పనితీరు మెరుగుపరుచుకోవాలి'

కోటనందూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సర్వేయర్లు, వీఆర్వోలు పనితీరు మెరుగుపర్చుకోవాలని తహసీల్దారు సుభాష్ కోరారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో సిబ్బందితో సమావేశమయ్యారు. రైతుల సమస్యలను సత్వరం పరిష్కరించాలన్నారు. ఫిర్యాదులు వస్తే సహించేదిలేదన్నారు. రీ సర్వేలో సమస్యలను తక్షణం పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇస్తానని ప్రకటించిందని, అందుకు తగ్గట్టుగా ఖాళీ స్థలాలు ఎక్కడున్నాయో సమాచారం త్వరగా ఇవ్వాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దారు సత్యనారాయణ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గీత, వీఆర్వోలు ఉదయ్‌కుమారి, రాజా, సత్యనారాయణ, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు చేయూత

రౌతులపూడి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) మూలగపూడిలో అగ్ని ప్రమాదానికి గురైన నీలి చిన్నయ్యమ్మతో పాటు మిగిలిన కుటుంబాలను సోమవారం కూటమి నేతలు పరామర్శించారు. ప్రమాదానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ తమరాల సత్యనారాయణ రూ.2వేలు, పది కిలోల బియ్యం, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు లవుడు శ్రీనివాస్ ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కూటమి నేతలు కోరుప్రోలు నానాజీ, రుత్తల రమేష్, యనమల చిన్నయ్య, తహసీల్దారు ఎస్.నరేష్, వీఆర్వో అనిమిరెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చింతూరు (ఆంధ్రజ్యోతి): మండలంలోని అగ్రారపు కొడేరు గ్రామంలో ఇటీవల అగ్ని ప్రమాదంలో ఇల్లు కోల్పోయిన కుటుంబానికి టీడీపీ చేయూతనిచ్చింది. ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు మఠం భాస్కర్ ఆదేశాల మేరకు టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ఇల్లా చిన్నారెడ్డి సోమవారం బియ్యం, దుస్తులు, వంట సామగ్రి అందజేశారు. తెలుగు యువత కార్యదర్శి శీలం తమ్మయ్య, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

1,400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రత్తిపాడు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు ఎక్సైజ్ శాఖ పరిధిలోని సిద్దువారిపాలెంలో సోమవారం నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్, ఎస్ఐ వంశీరామ్, సిబ్బంది దాడులు చేశారు. 1,400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనరు సత్యనారాయణ

నైపుణ్యంతో ఉపాధి అవకాశాలు

ఏలేశ్వరం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యం ఉంటే చక్కటి ఉపాధి అవకాశాలు పొందవచ్చని నగర పంచాయతీ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి అన్నారు. సోమవారం కమిషనరు సత్యనారాయణ అధ్యక్షతన సర్వీస్ ప్రొవైడర్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. వృత్తి పట్ల అవగాహన ఉంటే సొంత ఊళ్లోనే సేవలందించి ఆదాయం పొందవచ్చన్నారు. టీడీపీ అధ్యక్షుడు మూది నారాయణస్వామి, కౌన్సిలర్లు యండగండి నాగబాబు, రాయుడు చిన్న, పైల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

శంఖవరం ఇన్‌చార్జి తహసీల్దారుగా తాతారావు



శంఖవరం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ కలెక్టరేట్‌లో పని చేస్తున్న తాతారావును శంఖవరం ఇన్‌చార్జి తహసీల్దారుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పని చేసిన పోతురాజు పదోన్నతిపై ఎటపాక సబ్ కలెక్టరుగా వెళ్లారు. తాతారావు సోమవారం ఉదయం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించగా సిబ్బంది, స్థానిక నేతలు పోతురాజును ఘనంగా సత్కరించారు.

నేటి నుంచి గ్రామసభలు

శంఖవరం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని పంచాయతీల్లో మంగళవారం నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో శర్మ తెలిపారు. తొలి రోజు మండపం, పెదమల్లాపురం, వేళంగి, 22న శంఖవరం, గవిరంపేట, 23న వజ్రకూటం, 24న జి.కొత్తపల్లి, కత్తిపూడి, సీతయ్యమ్మపేట, ఎ.అన్నవరం, 25న ఎస్.జగ్గంపేట, అచ్చింపేట, 27న కొంతంగి, నెల్లిపూడిల్లో గ్రామ సభలు జరుగుతాయన్నారు. పనులను గుర్తించి, చేపట్టవలసిన పనులను ఆమోదిస్తామని ఎంపీడీవో చెప్పారు.


తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

రుద్ర భూమికి స్థలం కేటాయించాలని వినతి

ఏలేశ్వరం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పులక్ష్మీపురంలో రుద్ర భూమికి ప్రత్యేక స్థలం కేటాయించాలని బీజేపీ నాయకులు నీలి సురేష్, కూరాకుల రాజా సోమవారం తహసీల్దారు ఆర్.వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. సుమారు 50 సంవత్సరాలుగా దహన సంస్కారాలను పక్క గ్రామాల్లో చేయాల్సి వస్తోందని, అధికారులు స్పందించి స్థలం కేటాయించాలన్నారు. పతివాడ వెంకటేశ్వరరావు, బండారు సూరిబాబు, యేసు, గరికి నాగు పాల్గొన్నారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

తుని రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తుని ఆర్టీసీ డిపోలో మంగళవారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు 'డయల్ యువర్ డీఎం' నిర్వహించనున్నట్టు డిపో మేనేజరు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు, ప్రజలు 7382781490 నెంబరుకు ఫోను చేసి తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు.

పీజీఆర్‌కు రెండు అర్జీలు

గండేపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గండేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు రెండు అర్జీలు అందినట్టు ఎంపీడీవో నాతి బుజ్జి తెలిపారు. తహసీల్దారు ఆర్.శ్రీనివాస్, ఏవో ఎ.సద్గురుమూర్తి, ఏపీవో గంగాభవానీ, వెటర్నరీ డాక్టర్ ఎ.సుప్రియ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.